@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
# మన వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
ఆదివారం 25 అక్టోబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-



తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

## అధికార యంత్రాంగం
# అప్రమత్తంగా ఉండాలి

- ఏపీకి తుపాను గండం..
- అధికారులతో చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- బంగాళాఖాతంలో వాయుగుండం
- కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం
- సముద్రంలోకి వెళ్లవద్దని మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేయాలని స్పష్టీకరణ
- సహాయక చర్యల కోసం టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలని సూచన



**అమరావతి**

బంగాళాఖాతంలో తుపాను ఏర్పడే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) అధికారులతో ఆయన సమావేశమై పరిస్థితిని అంచనా వేశారు. తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఇది తుపానుగా మారే ప్రమాదం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. - మిగతా3లో



## క్రిప్టో ఆస్తులు, ఏఐపై
# ప్రత్యేక దృష్టి

- 46 ఆర్థిక అంశాలపై పార్లమెంటరీ కమిటీ అధ్యయనం
- 2026-27 ఆర్థిక సంవత్సరానికి కీలక అంశాలను ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం ఎంపిక
- క్రిప్టో, ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ వినియోగంపై ప్రత్యేకంగా పరిశీలనచనుంది



# అంజలి పెళ్లికి మరో వేదిక చూసుకోగలవు

- షర్మిలకు వైఎస్ జగన్ లేఖ
- వైఎస్ షర్మిల కుమార్తె అంజలి పెళ్లి విషయంలో జగన్‌పై జరుగుతున్న ప్రచారంపై వైఎస్సార్సీపీ స్పందించింది
- షర్మిలకు ఈనెల 9న జగన్ రాసిన లేఖను ఆ పార్టీ విడుదల
- బెంగళూరు నివాసానికి బదులుగా వివాహ వేడుకల కోసం వేరే కన్వెన్షన్ సెంటర్ లేదా డెస్టినేషన్ వెడ్డింగ్ వేదికను ఎంచుకోవాలని సూచన
- ఈ నివాసంలో పెండ్లి జరిపించడం వల్ల తన వ్యక్తిగత గోప్యతతో పాటు అత్యంత కీలకమైన భద్రత సమస్యలు తలెత్తుతాయి



# మోదీ ఫొటోకు క్షుద్రపూజలు!

- కేసు నమోదు చేసిన పోలీసులు
- ప్రధాని మోదీ ఫొటోకు క్షుద్రపూజలు చేసిన వీడియో ఆన్‌లైన్‌లో హల్‌చల్
- దీనితో ఉత్తరప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు




## ఫ్రాన్స్ నిరసనల్లో అరాచకం.. దుకాణాల లూటీ

- ఫ్రాన్స్‌లో అల్లర్ల నేపథ్యంలో వేల సంఖ్యలో దుకాణాల దోపిడీ
- దోచుకున్న లగ్జరీ వస్తువులు ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లలో ప్రత్యక్షం
- అమెజాన్, వింటెడ్ వంటి సంస్థలతో ప్రభుత్వం అత్యవసర సమావేశం
- అక్రమ అమ్మకాలను అడ్డుకోవాలని టెక్ కంపెనీలకు కఠిన ఆదేశాలు
- దొంగసొత్తు అమ్మితే కఠిన శిక్షలు తప్పవని ప్రభుత్వం హెచ్చరిక

## ఏపీని సెమీకండక్టర్ హబ్‌గా మార్చేందుకు
# కేంద్రం మద్దతు



- ఢిల్లీలో అమిత్ షా, అశ్విని వైష్ణవ్‌లతో చంద్రబాబు భేటీ.. రైల్వే, ఐటీ రంగాల్లో కీలక హామీలు
- రాష్ట్ర అభివృద్ధి, రాజకీయ అంశాలపై అమిత్ షా, చంద్రబాబు మధ్య చర్చ
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తోనూ సమావేశమైన ముఖ్యమంత్రి
- ఏపీలో రైల్వే ప్రాజెక్టుల వేగవంతం చేయాలని విజ్ఞప్తి
- విశాఖ నుంచి బెంగళూరుకు వందే భారత్ స్లీపర్ రైలుకు ఆమోదం
- రాష్ట్రంలోని 9 పోర్టులకు రైల్వే కనెక్టివిటీ కల్పించేందుకు అంగీకారం
- విజయవాడ బైపాస్ సహా పలు కీలక రైల్వే ప్రాజెక్టులను ప్రతిపాదించిన సీఎం

**అమరావతి**

ఢిల్లీ పర్యటనలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులతో జరిపిన సమావేశాలు ఫలప్రదంగా ముగిశాయి. ముఖ్యంగా రాష్ట్రంలో రైల్వే, ఐటీ రంగాల అభివృద్ధికి సంబంధించి కేంద్ర రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో జరిపిన భేటీలో పలు కీలక హామీలు, ఆమోదాలు లభించాయి. రాష్ట్ర భవిష్యత్‌కు అత్యంత కీలకమైన సెమీ కండక్టర్ డిజైన్, ఏఐ రంగాల్లో ఏపీని అగ్రగామిగా నిలిపేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని కేంద్ర మంత్రి భరోసా ఇచ్చారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు. అనంతరం కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో - మిగతా3లో

## రాహుల్ ఓట్ చోరీ ర్యాలీ సిక్కుల గాయాలపై కారం చల్లడమే

- కాంగ్రెస్ అగ్రనేతపై బీజేపీ ఫైర్
- నవంబర్ 1న ర్యాలీ నిర్వహణపై ఇండి కూటమిలోని పార్టీల మధ్య ఏకాభిప్రాయం లేదు
- బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్
- ఎవరు చెప్పినా వినకుండా రాహుల్ తన పంతం నెగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు






## ఢిల్లీలో అత్యుత్తమ గాలి నాణ్యత నమోదు

- దశాబ్ద కాలంలో ఇదే బెస్ట్!
- అక్టోబర్ 24న 191గా నమోదైన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- ప్రభుత్వ నిరంతర చర్యల వల్లే ఇది సాధ్యమైందన్న ఢిల్లీ పర్యావరణ మంత్రి
- గత 24 గంటల్లో వేలాది వాహనాలకు చలాన్లు, వ్యర్థాల తొలగింపు
- కాలుష్య నియంత్రణను యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తాం

# ఏపీలో స్థానిక ఎన్నికల పోరు ఆసక్తికరంగా కుటుంబ రాజకీయాలు



- స్థానిక ఎన్నికల్లో కుటుంబ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి
- రక్త సంబంధీకులే పోటీపడుతున్న పరిస్థితులూ నెలకొన్నాయి
- ఒకే కుటుంబం నుంచి వేర్వేరు పదవులకు పోటీ చేస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

**అమరావతి**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కుటుంబ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఈసారి కుటుంబ సభ్యులే పరస్పరం బరిలో నిలిచారు. అన్నదమ్ముళ్లు, అత్తాకోడళ్లు, తోటి కోడళ్లు ఒకరిపై ఒకరు పోటీ పడుతున్నారు. వీరంతా వేర్వేరు పార్టీల తరపున పోటీ చేస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఒకే కుటుంబానికి - మిగతా3లో



## వస్తోంది తుపాను కాదు.. అతి తీవ్ర తుపాను

- బంగాళాఖాతంలో వాయుగుండం.. అతి తీవ్ర తుపానుగా మారే సూచన
- అక్టోబర్ 28న ఏపీ తీరాన్ని తాకవచ్చని అంచనా
- బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 115-125 కి.మీ వేగంతో గాలులు
- ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలకు 'ప్రీ-సైక్లోన్ వాచ్' జారీ

# క్రిప్టో ఆస్తులు, ఏఐపై ప్రత్యేక దృష్టి

దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం సమగ్ర అధ్యయనం చేపట్టనుంది. క్రిప్టో ఆస్తులు, ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం, కరెన్సీ నిర్వహణ, బ్యాంకింగ్, బీమా, పన్నుల సంస్కరణలు సహా మొత్తం 46 అంశాలను 2026–27 ఆర్థిక సంవత్సరంలో పరిశీలనకు ఎంపిక చేసింది. ఈ అంశాలపై అధ్యయనం చేసి నివేదికలు సిద్ధం చేయనున్నట్లు లోక్‌సభ బులెటిన్ వెల్లడించింది.

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ నెల ప్రారంభంలో వివిధ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీలను పునర్వ్యవస్థీకరించారు. ఈ క్రమంలో ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘానికి బీజేపీ ఎంపీ భర్తృహరి మహతాబ్‌ను మరోసారి ఛైర్మన్‌గా నియమించారు. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాలు, వ్యయం, ప్రభుత్వ రంగ సంస్థలు, పెట్టుబడులు–ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, రెవెన్యూ, ఆర్థిక సేవల విభాగాలతో పాటు మరికొన్ని కీలక సంస్థలకు సంబంధించిన అంశాలను కమిటీ పరిశీలించనుంది. ధరల స్థిరత్వం, రూపాయి విలువ, ఆర్థిక నియంత్రణ వ్యవస్థలు, ప్రభుత్వ ఆస్తుల వినియోగం వంటి అంశాలపైనా కమిటీ దృష్టి సారించనుంది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్, గణాంకాలు–కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖలకు సంబంధించిన అంశాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఆయా రంగాల్లో విధానాల అమలు, పనితీరు, సంస్కరణల అవసరాన్ని అంచనా వేయడం ఈ అధ్యయనాల ప్రధాన ఉద్దేశం.

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వర్చువల్ డిజిటల్ ఆస్తులపై కమిటీ ప్రత్యేకంగా అధ్యయనం చేయనుంది. క్రిప్టో ఆస్తులకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులు, వాటి భవిష్యత్తు, ఈ రంగంలో అనుసరించాల్సిన విధానాలపై పరిశీలన చేపట్టనుంది. ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ వినియోగం వల్ల కలిగే అవకాశాలు, ఎదురయ్యే సమస్యలను కూడా అధ్యయనం చేయనుంది. బ్యాంకింగ్,



ఆర్థిక సేవలు, డిజిటల్ లావాదేవీలు వంటి విభాగాల్లో కొత్త సాంకేతికత వినియోగం పెరుగుతున్నందున సంబంధిత అంశాలపై సమగ్ర విశ్లేషణకు ప్రాధాన్యత ఇవ్వనుంది. అదే సమయంలో ఆర్థిక రంగంలో నియంత్రణ వ్యవస్థల పనితీరు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) రంగంలో ఉన్న నియంత్రణ లోపాలను పరిశీలించనుంది. ఈ రంగాల్లో తగిన పర్యవేక్షణ, పారదర్శకతకు సంబంధించిన అంశాలపై కూడా నివేదిక రూపొందించనుంది.

### ధరల స్థిరత్వం కరెన్సీ నిర్వహణ

దేశ ఆర్థిక వ్యవస్థలో ధరల స్థిరత్వం, కరెన్సీ నిర్వహణ కీలక పాత్ర పోషిస్తాయి. వీటికి సంబంధించి అనుసరిస్తున్న వ్యూహాలు, ఎదురవుతున్న సవాళ్లను కమిటీ సమీక్షించనుంది. మారుతున్న స్థూల ఆర్థిక పరిస్థితులను విశ్లేషించడంతో పాటు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) పాత్రను కూడా పరిశీలించనుంది. చిన్న మొత్తాల పొదుపు పథకాల పనితీరు, ఆర్థిక వ్యవస్థలో వాటి ప్రాధాన్యం వంటి అంశాలపై అధ్యయనం చేపట్టనుంది. ప్రభుత్వ రంగ ఆస్తుల నగదీకరణ ద్వారా వనరులను సమర్థంగా వినియోగించుకునే విధానాలనూ పరిశీలించనుంది. ఇక బ్యాంకింగ్, పెన్షన్, ఆరోగ్య బీమా రంగాల పనితీరుతో పాటు అసంఘటిత రంగంలోని కార్మికులకు సామాజిక భద్రత కల్పించే అంశాలపైనా కమిటీ దృష్టి సారించనుంది. కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాల అమలు, ఫలితాలను సమీక్షించనుంది.

### జీఎస్‌టీ, ప్రత్యక్ష పన్నుల సంస్కరణలు

పన్నుల విధానంలో మార్పులు, సంస్కరణలకు సంబంధించిన అంశాలు కూడా కమిటీ పరిశీలనలో ఉన్నాయి. కస్టమ్స్ సుంకాలు, వస్తు–సేవల పన్ను (జీఎస్‌టీ), ప్రత్యక్ష పన్నుల వ్యవస్థల్లో చేపట్టాల్సిన మార్పులపై అధ్యయనం చేయనుంది. పన్నుల విధానాలు ఆర్థిక కార్యకలాపాలు, ప్రభుత్వ ఆదాయంపై చూపే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని సంస్కరణల అవసరాన్ని అంచనా వేయనుంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) పనితీరును కూడా సమీక్షించనుంది. ఆర్థిక మార్కెట్ల నియంత్రణ, పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణ వంటి అంశాలు ఈ పరిశీలనలో ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది.

### కంపెనీల నిర్వహణ, ఆడిటర్ల బాధ్యతలు

కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలో జాతీయ కంపెనీ చట్ట ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై కమిటీ అధ్యయనం చేయనుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్), కంపెనీల ఈ–గవర్నెన్స్, ఆడిటర్ల జవాబుదారీతనం వంటి అంశాలను కూడా పరిశీలించనుంది. కంపెనీల పాలనలో పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ అధ్యయనాలు ఉపయోగపడే అవకాశం ఉంది.

### నీతి ఆయోగ్, ఆర్థిక గణాంకాలపై సమీక్ష

రంగాలవారీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో నీతి ఆయోగ్ పాత్రను కమిటీ పరిశీలించనుంది. వెనుకబడిన జిల్లాల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్న ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం పనితీరును కూడా సమీక్షించనుంది. గణాంకాలు–కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ పరిధిలో జాతీయ ఖాతాల గణాంకాలపై అధ్యయనం చేపట్టనుంది. దేశ ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడానికి అవసరమైన గణాంకాల సేకరణ, విశ్లేషణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించనుంది.

# రాహుల్ ఓట్ చోరీ ర్యాలీ సిక్కుల గాయాలపై కారం చల్లడమే

1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల గాయాలపై కారం చల్లే ఉద్దేశంతో దిల్లీలో నవంబరు 1న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరసన ర్యాలీకి పిలుపునిచ్చారని బీజేపీ ఆరోపించింది. ర్యాలీ నిర్వహణపై ఇండి కూటమిలోని పార్టీల మధ్య ఏకాభిప్రాయం లేదని విమర్శించింది. ర్యాలీ వాయిదా వేయాలని కోరుతున్నప్పటికీ, ఎవరు చెప్పినా రాహుల్ మాట వినడం లేదని దుయ్యబట్టింది. తన పంతం నెగ్గించుకునేందుకు రాహుల్? ప్రయత్నిస్తున్నారని బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. సిక్కు సమాజం మనోభావాలను పట్టించుకోవడం లేదనేదే కాంగ్రెస్ సందేశమని ఆయన ఆరోపించారు. దిల్లీ పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

### 'సీఈసీని పదవినుంచి తొలగించాలి'

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్?ఐఆర్?)లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చలో దిల్లీ పేరిట నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి భారీ ర్యాలీ తలపెట్టనుంది. ఓటు చోరీకి వ్యతిరేకంగా దాదాపు 10 లక్షల మందితో ఈ నిరసన కవాతు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్? కుమార్(సీఈసీ)ను పదవి నుంచి తొలగించాలని



డిమాండ్ చేస్తూ ర్యాలీ తలపెట్టనున్నట్లు పేర్కొంది. ఆ ర్యాలీలో జనం అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఇప్పటికే సీఈసీకి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించడంతో పాటు, పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ప్రదర్శనగా వెళ్లి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ప్రతిపక్ష నేతలు కలిశారు.

### ర్యాలీతో చిరువ్యాపారులకు ఇబ్బందులు

పండుగ సీజన్ వేళ దిల్లీలో ర్యాలీ తలపెట్టడం వల్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నవంబర్ 1న రామ్‌లీలా మైదాన్‌లో జరగాల్సిన పార్టీ ర్యాలీని నవంబర్ 10 తర్వాతకు వాయిదా వేయాలని కోరుతూ ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) శనివారం రాహుల్ గాంధీకి లేఖ రాసింది. లేఖలో, ఈ ఏడాది నవంబర్ 10న వచ్చే భాయ్ దూజ్ తర్వాత మరో తేదీకి ర్యాలీని వాయిదా వేయాలని సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ అభ్యర్థించారు. ధంతేరస్, దీపావళి, భాయ్ దూజ్ పండుగలు దిల్లీ రిటైల్ మార్కెట్లకు అత్యంత అనువైన సమయమని వ్యాపారుల సంఘం పేర్కొంది. ఆ సమయంలో వ్యాపారులు పండుగ కొనుగోళ్లు, అమ్మకాలను చాలా ముందుగానే ప్రారంభిస్తారని నొక్కి చెప్పింది. బంగారం, వెండి, పాత్రలు, ఎలక్ట్రానిక్స్, దుస్తులు, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, ఆటోమొబైల్స్, ఫర్నిచర్ ఇతర వస్తువుల వంటి రంగాలను కలుపుకొని, కేవలం ధంతేరస్ సందర్భంగానే దిల్లీలో సుమారు రూ. 25,000 కోట్ల విలువైన వ్యాపారం జరుగుతుందని అంచనా వేసింది.

### ఇందిరా గాంధీ హత్యతో సిక్కు వ్యతిరేక అల్లర్లు

ఇదిలా ఉండగా, 1984 అక్టోబర్ 31న అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ హత్యకు గురైన తర్వాత, దిల్లీతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగాయి. చాలా మంది బాధితులు అల్లర్లలో తీవ్రంగా గాయపడ్డారు.

# భారత్‌లో వారిని చూసి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి

**ఆ జ్ఞాపకాలు ఎప్పుడూ నాతోనే ఉంటాయి**

**పోలాండ్ ప్రధాని**

**దృష్టిలోపం ఉన్న చిన్నారులను సంరక్షిస్తున్న కేంద్రానికి వెళ్లిన డొనాల్డ్ వారిని చూసి చలించిపోయారు.**

'జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా, పరిస్థితులు ఎంతలా మారినా మదిలోని కొన్ని జ్ఞాపకాలు మాత్రం ఏళ్ల తరబడి మనతోనే ఉంటాయి. ఏ కాలం ఏ విధి వాటిని మన నుంచి దూరం చేయలేవు' అని అంటారు. సరిగ్గా పోలాండ్? ప్రధానమంత్రి డొనాల్డ్ టుస్క్‌కి అదే జరిగింది. ఇటీవల భారత పర్యటనకు వచ్చిన ఆయనకు ఓ మధురాతి అనుభవం ఎదురైంది. 16 సంవత్సరాల క్రితం భారత్?ను సందర్శించినపుడు జరిగిన భావోద్వేగభరితమైన సంఘటనను ఆయన గుర్తుచేసుకున్నారు.

### ఇంతకీ అదేంటంటే!

ఫ్రాన్స్, పోలండ్‌కు చెందిన కొంతమంది ఏర్పాటుచేసిన అంధుల సంరక్షణ కేంద్రాన్ని 16 ఏళ్ల క్రితం బెంగళూరు పర్యటనకు వచ్చిన డొనాల్డ్ టుస్క్ సందర్శించారు. దృష్టిలోపం ఉన్న చిన్నారులను సంరక్షిస్తున్న కేంద్రానికి వెళ్లిన డొనాల్డ్ వారిని చూసి చలించిపోయారు. తాజాగా మళ్లీ భారత్ పర్యటనకు వచ్చిన టుస్క్ మరోసారి ఆ కేంద్రాన్ని సందర్శించారు. పోలండ్ జాతీయగీతంలోని పదాలను పిల్లలు గుర్తుంచుకోవడాన్ని చూసి టుస్క్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాసేపు ఆ పిల్లలతో ముచ్చటించారు. అలాగే, అప్పటి వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. అందులో "సరిగ్గా 16 ఏళ్ల క్రితం ఈ కేంద్రాన్ని పోలండ్ ప్రతినిధి బృందంతో కలిసి నేను ఈ కేంద్రాన్ని సందర్శించాను. ఆ సమయంలో చిన్నారులు మా దేశ జాతీయగీతం పాడటం చూసి ఆశ్చర్యపోయాం. పిల్లలు





పోలిష్ జాతీయ గీతాన్ని పాడినప్పుడు మా కళ్లలో నీళ్లు తిరిగాయి. నేడు వారంతా పెద్దవారయ్యారు. కానీ వారికి ఇప్పటికీ 'మజురెక్ డాబ్రోవ్స్కిగో' (పోలిష్ జాతీయ గీతం)లోని పదాలు గుర్తున్నాయి. ఈరోజు వారిని చూసిన తర్వాత కళ్లలో నీళ్లు తిరిగాయి" అని ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. టుస్క్ పోస్ట్ చేసిన వీడియోలో గులాబీ రంగు దుస్తులు ధరించిన పిల్లలు పోలాండ్ జాతీయ గీతం పాడారు. అనంతరం టుస్క్ వారికి అభినందించి బహుమతులు అందించారు.

### మూడు రోజుల పర్యటనకు భారత్‌కు విచ్చేసిన టుస్క్

టుస్క్ అక్టోబర్ 21 నుంచి 23 వరకు మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం భారత్?కు వచ్చారు. అక్టోబర్ 21న దేశానికి చేరుకున్నారు. మరుసటి రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్‌లను కలిశారు. పలు కీలక విషయాలపై చర్చలు జరిపారు. అనంతరం రెండు దేశాలు కలిసి నాలుగు అంశాలపై ప్రకటన చేశాయి. అందులో వాణిజ్యం రెట్టింపు, రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుపై చర్చలు, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం వంటివి ఉన్నాయి. వీటితో పాటు ఇరుదేశాల మధ్య విస్తృత రక్షణ బంధానికి బాటలు పడ్డాయి. అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లోనూ మరింతగా సహకరించుకోవాలని కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. దీంతోపాటు వాణిజ్యాన్ని ఇప్పుడున్న దానికి రెట్టింపు చేస్తూ 2030 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. పోలండ్‌తో కలిసి రక్షణ, అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లో అభివృద్ధి, తయారీకి కృషి చేయాలని నిర్ణయించామని మోదీ పేర్కొన్నారు. కీలక ఖనిజాలు, బొగ్గు రంగాల్లోనూ సహకరించుకోవాలని అంగీకరించినట్లు చెప్పారు. రష్యా– ఉక్రెయిన్?తో పాటు పశ్చిమాసియాల్లో శాంతి సాధనకు జరిగే ఎటువంటి అర్థవంతమైన ప్రయత్నాలకైనా పూర్తి మద్దతిస్తామని మోదీ స్పష్టం చేశారు. భారత్, పోలండ్ దేశాలు ప్రజాస్వామ్య విలువలను నమ్ముతాయని, చట్టాలను గౌరవిస్తాయని అన్నారు. అదే సమయంలో మోదీపై టుస్క్ ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన తన స్నేహితుడని చెప్పుకోవడం గర్వంగా ఉందని అన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జామ్‌నగర్, కొల్హాపూర్ రాజ కుటుంబాలు పోలండ్‌కు చెందిన వేల మంది పిల్లలు, ప్రజలకు ఆశ్రయమివ్వగా, 2022లో ఉక్రెయిన్–రష్యా యుద్ధం ప్రారంభమైనప్పుడు అదే తరహాలో భారతీయులను తరలించేందుకు పోలండ్ సహకరించిందని మోదీ చెప్పారు.

## ఫ్రాన్స్ నిరసనల్లో అరాచకం.. దుకాణాల లూటీ..

ఫ్రాన్స్‌లో ఇటీవల చెలరేగిన అల్లర్ల నేపథ్యంలో చోటుచేసుకున్న దుకాణాల లూటీ వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. నిరసనకారులు, దుండగులు దోచుకున్న ఖరీదైన లగ్జరీ వస్తువులను ప్రముఖ ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లలో అమ్మకానికి పెట్టడం తీవ్ర కలకలం రేపుతోంది. దీంతో అప్రమత్తమైన ఫ్రాన్స్ ప్రభుత్వం, ఈ అక్రమ అమ్మకాలను అడ్డుకునేందుకు కఠిన చర్యలు చేపట్టింది. ఫ్రాన్స్ వాణిజ్య శాఖ మంత్రి సెర్జ్ పాపిన్ ప్రకారం, దేశవ్యాప్తంగా జరిగిన అల్లర్లలో సుమారు 3,000 రిటైల్ దుకాణాలు ధ్వంసం లేదా దోపిడీకి గురయ్యాయి. ముఖ్యంగా పారిస్‌లోని లెస్ హాల్స్ జిల్లాలో ఉన్న హెర్మేస్, లూయిస్ విట్టన్, ది నార్త్ ఫేస్ వంటి ప్రముఖ బ్రాండ్ల ఫ్లాగ్‌షిప్ స్టోర్లు తీవ్రంగా నష్టపోయాయి. దుకాణాల్లో దోపిడీ జరిగిన కొద్ది గంటల్లోనే, డిజైనర్ హ్యాండ్‌బ్యాగులు, ఖరీదైన సౌందర్య సాధనాలు, కాస్మెటిక్స్ వంటివి వింటెడ్, అమెజాన్, లెబాన్‌కాయిన్ వంటి ఆన్‌లైన్ సైట్లలో అమ్మకానికి ప్రత్యక్షమయ్యాయి. ఈ పరిణామంతో ఫ్రాన్స్ ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగింది. వాణిజ్య మంత్రి సెర్జ్ పాపిన్, డిజిటల్ వ్యవహారాల మంత్రి అన్నే లే హెనాఫ్.. వింటెడ్, అమెజాన్, ఈబే, మెటా, టిక్‌టాక్ వంటి సంస్థల ప్రతినిధులతో అత్యవసర వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఆయా ప్లాట్‌ఫామ్‌లపై ఉన్న దొంగసొత్తుకు సంబంధించిన లిస్టింగులను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన వింటెడ్, తమ ప్లాట్‌ఫామ్‌పై దొంగిలించిన వస్తువుల అమ్మకాల పట్ల "జీరో టాలరెన్స్" విధానాన్ని అనుసరిస్తామని తెలిపింది. తమ సైట్‌లో అసాధారణ రీతిలో లగ్జరీ వస్తువుల లిస్టింగులు పెరిగినట్లు గుర్తించామని, అధికారులతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొంది. మరోవైపు, ఈబే కూడా తమ వద్ద దొంగసొత్తు అమ్మకాలను నిషేధించామని, అనుమానాస్పద ఖాతాలను గుర్తించేందుకు ప్రత్యేక అల్గారిథమ్‌లు, పరిశోధకుల బృందాలు ఉన్నాయని వెల్లడించింది. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మాట్లాడుతూ.. దోపిడీలకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఫ్రెంచ్ చట్టాల ప్రకారం, దొంగసొత్తును కలిగి ఉండటం, అమ్మడం లేదా బదిలీ చేయడం వంటి నేరాలకు పాల్పడితే ఐదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు 375,000 యూరోల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

## వస్తోంది తుపాను కాదు.. అతి తీవ్ర తుపాను

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది వేగంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ఇది రానున్న కొద్ది రోజుల్లో 'అతి తీవ్ర తుపాను'గా మారి రాష్ట్రంపై పెను ప్రభావం చూపనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్టోబర్ 28న బాపట్ల–విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, యానాం తీర ప్రాంతాలకు 'ప్రీ–సైక్లోన్ వాచ్' జారీ చేసింది. న్యూఢిల్లీలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం శనివారం విడుదల చేసిన ప్రత్యేక బులెటిన్ ప్రకారం.. ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది ప్రస్తుతం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 820 కిలోమీటర్లు, కాకినాడకు 910 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం తొలుత దక్షిణ దిశగా కదిలి, అక్టోబర్ 25న తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత దిశ మార్చుకుని పశ్చిమ–వాయవ్య దిక్కుగా ప్రయాణించి మరింత శక్తిని పుంజుకోనుంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ అక్టోబర్ 26 నాటికి తుపానుగా, 27 నాటికి తీవ్ర తుపానుగా, 28వ తేదీ ఉదయం నాటికి అతి తీవ్ర తుపానుగా మారుతుంది. అక్టోబర్ 28వ తేదీన ఉదయం 11:30 గంటల ప్రాంతంలో బాపట్ల–విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో గాలి వేగం గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగానికి చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను ఏర్పడటానికి, అది బలపడటానికి సముద్రంలో పరిస్థితులు అత్యంత అనుకూలంగా ఉన్నాయని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 29–30 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండటం, మాడెన్–జూలియన్ ఆసిలేషన్ (ఎంజేఓ) వంటి వాతావరణ అంశాలు ఈ తుపాను తీవ్రతను పెంచేందుకు దోహదం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక వాతావరణ నమూనాలు (మోడల్స్) కూడా ఈ తుపాను ఏపీ తీరం వైపే వస్తుందని, అతి తీవ్రంగా మారుతుందని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని నమూనాలు ఒడిశా లేదా తమిళనాడు వైపు సూచించినప్పటికీ, అందుకు అవకాశాలు తక్కువ అని భావిస్తున్నారు. ప్రస్తుత అంచనాల కచ్చితత్వంపై వాతావరణ శాఖ స్పందించింది. తుపాను మార్గం, తీవ్రతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సమాచారాన్ని అందిస్తామని తెలిపింది. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు, సముద్రపు అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు.

## మోదీ ఫొటోకు క్షుద్రపూజలు!

ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను ఉపయోగించి, శ్మశానవాటిక సమీపంలో క్షుద్రపూజలు చేస్తున్నట్లు ఉన్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనితో పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. "సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోలో, దోరిఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సరయూ నదీ తీరాన ప్రధాని మోదీ ఫొటో చుట్టూ కొబ్బరికాయలు, నిమ్మకాయలు పెట్టారు. నారింజ రంగు పొడితో ముగ్గులు వేసి ఉన్నాయి. ఈ వీడియో ఎక్కడి నుంచి వచ్చిందో ఆరా తీస్తున్నాం. ఘటన జరిగిన ప్రదేశం నుంచి కూడా ఆధారాలు సేకరిస్తున్నాం. అలాగే చుట్టుపక్కల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం. గుర్తు తెలియని నిందితులపై భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్)లోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశాం" అని ఘోసీ సర్కిల్ ఆఫీసర్ సత్యేంద్ర భూషణ్ తివారీ చెప్పారు. నదీతీరాన ప్రధాని ఫొటోను, పూజా సామగ్రిని ఎవరు ఉంచారు సోషల్ మీడియాలో ఈ వీడియో ప్రచారం చేయడం వెనుకున్న వారి ఉద్దేశం ఏమిటి అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఢిల్లీలో అత్యుత్తమ గాలి నాణ్యత నమోదు..

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యంపై ప్రభుత్వాలు సాగిస్తున్న పోరాటం సత్ఫలితాలనిస్తోంది. శనివారం నాడు (అక్టోబరు 24) నగరంలో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 191 వద్ద 'మోడరేట్' కేటగిరీలో నమోదైందని, ఇది గత దశాబ్ద కాలంలో నమోదైన అత్యుత్తమ గాలి నాణ్యత అని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా ప్రకటించారు. కోవిడ్–19 ప్రభావిత కాలాన్ని మినహాయిస్తే, పదేళ్లలో ఇదే అత్యంత మెరుగైన ఏక్యూఐ అని ఆయన అన్నారు. వాయు కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం చేస్తున్న నిరంతర పోరాటంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అని ఆయన అభివర్ణించారు. గత గణాంకాలను పరిశీలిస్తే, అక్టోబర్ 24న 2024లో ఏక్యూఐ 306గా, 2025లో 275గా నమోదైందని, ఈ ఏడాదది 191కి తగ్గడం గణనీయమైన పురోగతిని సూచిస్తోందని మంత్రి వివరించారు. కాలుష్య నివారణకు చేపట్టిన స్థిరమైన చర్యలు, కఠినమైన అమలు, వివిధ ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయంతో కూడిన జోక్యం వల్లే ఈ సానుకూల మార్పు సాధ్యమైందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేఖా గుప్తా నాయకత్వంలో ఢిల్లీ ప్రభుత్వం కాలుష్య నియంత్రణకు సమగ్రమైన, కార్యాచరణ–ఆధారిత విధానాన్ని అవలంబిస్తోందని సిర్సా పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నిబంధనల అమలు, రెగ్యులర్ తనిఖీలు, జిల్లా స్థాయి సమీక్షలు, టెక్నాలజీ ఆధారిత పర్యవేక్షణ వంటి బహుముఖ వ్యూహాలతో కాలుష్య కారకాలను మూలాల వద్దే అరికట్టడంపై దృష్టి సారించినట్లు చెప్పారు. గాలి నాణ్యతలో ఈ మెరుగుదల ప్రభుత్వ నిరంతర కృషి, అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, ఢిల్లీ నివాసితుల సమష్టి సహకారం వల్లే సాధ్యమైందని మంత్రి అన్నారు. స్వచ్ఛమైన గాలి కోసం సాగుతున్న ఈ ప్రచారానికి మద్దతిస్తున్న ఢిల్లీ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా గాలి నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు తమ ప్రయత్నాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. కాలుష్య నియంత్రణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని సంబంధిత శాఖలను ఆదేశించినట్లు స్పష్టం చేశారు. జవాబుదారీతనం, సమర్థవంతమైన అమలు, ప్రజా భాగస్వామ్యంతో ఈ ప్రచారాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనసాగిస్తామని సిర్సా పునరుద్ఘాటించారు. కాలుష్య నివారణ చర్యలను ముమ్మరం చేయడంలో భాగంగా, గత 24 గంటల్లో ప్రభుత్వం చేపట్టిన కీలక చర్యల వివరాలను కూడా వెల్లడించారు. వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు 9,883 వాహనాలకు చలాన్లు విధించారు. గుర్తించిన ప్రాంతాల నుంచి 12,702 మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించారు. రోడ్లపై దుమ్ము ధూళిని నియంత్రించేందుకు 1,075 కిలోమీటర్ల మేర నీటిని చల్లారు. 2,223 మెట్రిక్ టన్నుల నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను తరలించడంతో పాటు, 2,810 కిలోమీటర్ల రోడ్లను మెకానికల్ స్వీపింగ్ ద్వారా శుభ్రం చేశారు.

# ఎన్నికల వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్న చంద్రబాబు





**సామర్లకోట,అక్టోబర్ 24 ( మీ వార్త ప్రతినిధి)** ప్రజాస్వామ్య విలువలను, ప్రజల హక్కులను ప్రభుత్వం అణచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా పాలన సాగిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు విమర్శించారు. శనివారం ఉదయం నుండి ఎన్నికల ప్రచారంలో మధు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడం, ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజలకు తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేసే వేదికగా మారాయని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించి ప్రజల వాయిస్‌ను మున్సిపల్ కౌన్సిళ్లలో బలంగా వినిపించాలని తాటిపాక మధు ప్రజలకు పిలుపునిచ్చారు. కార్మికులు, రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలు, నిరుద్యోగులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సీపీఐ అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు.11 వార్డులో పోటీ చేస్తున్న సప్పా సూరిబాబు విజయం సాధించాలని ఆకాంక్షించారు స్థానిక సంస్థల్లో ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్షం బలంగా ఉంటేనే పాలకులపై ప్రజా ఒత్తిడి పెరుగుతుందని, ప్రజల సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని ఆయన అన్నారు. కంకి--కొడవలి గుర్తుపై ఓటు వేసి సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి సత్యనారాయణ, శాఖ రామకృష్ణ, మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ కేత అరుణ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు మడకల రమణ. అర్జున అడపా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు

# ఏలూరులో పలు డివిజన్ లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా విస్తృత ఎన్నికల ప్రచారం..!

## ఏలూరు నగర అభివృద్ధే లక్ష్యం..

## కూటమి అభ్యర్థులకు అఖండ మెజారిటీ అందించండి ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు విజ్ఞప్తి





**ఏలూరు, అక్టోబర్ 24:-** ఏలూరు నగర కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలనే లక్ష్యంతో శనివారం ఉదయం పలు డివిజన్‌లో జిల్లా టిడిపి అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి.మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు, ఉమ్మడి కూటమి పార్టీల నాయకులు విస్తృత ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.. 15 వ డివిజన్ సత్యనారాయణ థియేటర్ వద్ద కూటమి కార్పోరేటర్ అభ్యర్థి రాజా మురళి, 16 వ డివిజన్ 7 గోరీల సెంటర్ లో కూటమి కార్పోరేటర్ అభ్యర్థి మారం హనుమంతరావు (అను), 14 వ డివిజన్ ఏడు కాలువల సెంటర్ కనకదుర్గ గుడి వద్ద కూటమి కార్పోరేటర్ అభ్యర్థి పోలమర శెట్టి గోపాలకృష్ణ ఆయా డివిజన్ లలో కూటమి అభ్యర్థులతో కలిసి వారు పర్యటించగా పలుచోట్ల ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. జనసేన పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అనుభవంతో పాటు, జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, ఏలూరు నగర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. "ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు.. ప్రతి అడుగులో అభివృద్ధి" అనే లక్ష్యంతో ఏలూరు నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజలందరూ కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటును వేసి సంపూర్ణ మద్దతు అందించాలని వారిరువురు కోరారు. ఏలూరులో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో మరింత పురోగతి సాధించేందుకు కూటమి అభ్యర్థుల విజయమే కీలకమని వారు పేర్కొన్నారు. ఏలూరు నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి నాయకత్వం సమన్వయంతో ముందుకు సాగుతోందని వివరించారు.. ఏలూరు నగర మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు పాటు 62 డివిజన్ లో కూటమి బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని వారు కోరారు.. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో జనసేన నాయకులు నారా శేషు, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, జనసేన నగర అధ్యక్షులు వీరంకి పండు, ఈడ చైర్మన్ పెద్దిబోయిన శివ ప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, కూటమి నాయకులు బొద్దాని శ్రీనివాస్,ఓబిలిశెట్టి శ్రావణ్ గుప్తా, పూజారి నిరంజన్, రెడ్డి గౌరీ శంకర్, నూకల సాయి ప్రసాద్, భారీ సంఖ్యలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ఏలూరు నగర కార్పొరేషన్‌లో కూటమి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసి, నగర అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

# ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా పాఠశాలను సందర్శించిన ఎండిఓ

**తల్లాడ, అక్టోబర్ 24 ( మీ వార్త విలేఖరి ):** 81వ ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా ఫ్యూచర్ జెన్ పాఠశాలను తల్లాడ ఎంపీడీవో అంబటి శ్రీధర్ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రపంచ శాంతి,సామరస్యాన్ని కాపాడుతూ దేశభక్తిని గౌరవిస్తూ హక్కుల పట్ల అవగాహనతో ఉంటూ ఇతరుల పట్ల సహకార స్వభావాన్ని కలిగి ఉండాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రపంచంలో ఆర్థిక లాభాపేక్షతో జరుగుతున్న యుద్ధ పరిణామాలను వివరిస్తూ అనేక మంది సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. అందుకని విద్యార్థులు ఒకరికొకరు ఐకమత్యంగా, ప్రజాస్వామ్య యుతంగా జీవిస్తే దేశంలో అశాంతి పరిస్థితులకు తావుండదన్నారు. అంతేకాకుండా విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగం పట్ల దృష్టి సారించే విధంగా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలన్నారు.

ఈ సందర్భంగా అండర్ 14 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో పాల్గొన్న ఫ్యూచర్ జెన్ పాఠశాల విద్యార్థి సుమిత్ జాట్ రజత పథకం సాధించినందుకు అభినందించారు. అదేవిధంగా జాట్ కు శిక్షణ ఇచ్చిన పి ఈ టి దిలీప్ కుమార్ ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను విద్యతోపాటు క్రీడలలోనూ ఇలా మంచి ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులకు , ఉపాధ్యాయులకు మంచి సూచనలు తెలియజేసినందుకు శ్రీధర్ రాజు కు పాఠశాల కరస్పాండెంట్ శ్రీమతి ఎ. సబిత కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీమతి వి . సబిత, డైరెక్టర్ ఎమ్ డి తౌసిప్, కోఆర్డినేటర్ ఎ మధు, ప్రిన్సిపల్ పి వి లక్ష్మణ్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు




# రావిపాడులో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎంఈఓ-2 రామకృష్ణ



**పెంటపాడు అక్టోబర్ 24 (మీ వార్త ప్రతినిధి)** పెంటపాడు మండలం రావిపాడు ఎంపీఎస్ పాఠశాలను ఎంఈఓ-2 డాక్టర్ టి.వి. రామకృష్ణ అక్టోబర్ 24న సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని (ఎండీఎం) పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజన పంక్తిలో కూర్చుని భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. భోజన నాణ్యత, మెనూ పాటింపు, విద్యార్థుల హాజరు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఎస్ హెచ్ఎం కాశి విశ్వనాథం, ఉపాధ్యాయులు పరదేశి, సౌజన్య,మంగతాయారు పాల్గొన్నారు.

# మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థి శ్రీమతి అబ్దుల్ అబీద ప్రచారం



**మచిలీపట్నం అక్టోబర్ 24(మీ వార్త ప్రతినిధి)** మచిలీపట్నం నగరాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో ముందుకు నడిపించడమే లక్ష్యమని కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థి శ్రీమతి అబ్దుల్ అబీద అన్నారు. శనివారం మచిలీపట్నం నగర కార్పొరేషన్ 55వ డివిజన్ నందు డివిజన్ కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, పి. విమల గాయత్రి తో కలసి డివిజన్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి. అబ్దుల్ అబీద మాట్లాడుతూ..నగరంలో పార్కులు, బరియల్ గ్రౌండ్స్, డ్రైన్లు, గ్రీనరీ బ్యూటిఫికేషన్ తదితర అభివృద్ధి కార్యక్రమాలకి ప్రాధాన్యత ఇస్తామన్నారు. కూటమి ప్రజా ప్రతినిధులు మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలసౌరి, ఆర్టీసీ చైర్మన్, కొనకళ్ళ నారాయణరావు తదితరులు మన నగరం అభివృద్ధి చెందే విధంగా 8 వేల కోట్ల పెట్టుబడితో గోవా షిప్ యార్డ్ మన మచిలీపట్నానికి రావడం వల్ల ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. మచిలీపట్నం నగరం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో తీర్చిదిద్దుతాను అన్నారు. ఈ కార్యక్రమంలో 55వ డివిజన్ కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, పి. విమల గాయత్రి తో పాటుగా జనసేన నాయకుడు, మాదివాడ రాము, డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు, పి. వి. ఫణి కుమార్, గంజాల రవికుమార్, కొనకళ్ళ భాను ప్రసాద్, కోమటి వెంకటేశ్వరరావు, కొనకళ్ల అరుణ్ కుమార్, తోట శ్యామ్, సలకా కృష్ణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యం తో యువ వైద్యురాలు పావని మృతి

## నగరం పీహెచ్‌సీలో విషాదం



**మామిడికుదురు, అక్టోబర్ 24 ( మీ వార్త విలేఖరి ):** అంబేద్కర్ కోనసీమ జిల్లా నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. అక్కడ వైద్యాధికారి-2గా విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు ఆర్ పావని (31) అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కేవలం 31 ఏళ్ల వయసులోనే ఆమె మృతి చెందడం వైద్య వర్గాలతో పాటు పలువురిని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. డాక్టర్ పావని మృతిపట్ల నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జాన్ లెవీతో పాటు ఆసుపత్రి సిబ్బంది తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# పాయకరావుపేటలో ఎక్సైజ్ శాఖ అధికారుల తనిఖీలు





**పాయకరావుపేట, మీ వార్త ప్రతినిధి,** అక్టోబరు 23 : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాల్లో శుక్రవారం ఎక్సైజ్ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మూడు మండలాల్లోని వివిధ మద్యం దుకాణాల్లో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం దుకాణాల్లో క్రయ విక్రయాలను పరిశీలించడంతో పాటు ఎక్సైజ్ సురక్ష మొబైల్ అప్లికేషన్ ద్వారా మద్యం నిల్వలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మద్యం నిల్వలు ఎలాంటి ఉల్లంఘనులు లేకుండా నిబంధనల ప్రకారం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం షాపుల నిర్వాహకులు లైసెన్స్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ జి శ్రీనివాసు సూచించారు. ఈ తనిఖీల్లో పాయకరావుపేట ఎక్సైజ్ ఎస్ఐ కె మురళీ మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని వెంకటనగరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సిరిపల్లి జ్యోతి నుంచి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశామని సిఐ శ్రీనివాసు తెలిపారు.

# తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ 35 వార్డుల నుండి 48 వార్డులుగా విభజన

**1,00,728 మంది ఓటర్ల గుర్తింపు**

**మున్సిపల్ కమిషనర్ ఎం ఏసుబాబు**



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 24 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో డీ-లిమిటేషన్ లో భాగంగా గతంలో ఉన్న 35 వార్డులను 48 వార్డులుగా విభజించారు. దీనికి సంబంధించిన ఓటరు జాబితాను సిద్ధం చేసి ప్రచురించారు. 48 వార్డులకు గాను మొత్తం 1,00,728 మంది ఓటర్లను గుర్తించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం. యేసుబాబు ఓటరు జాబితా తయారీ పనులపై సమీక్ష నిర్వహించారు. కులాల వారీగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీలలో స్త్రీ, పురుష వర్గీకరణతో కచ్చితమైన జాబితా రూపొందించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ పనులు పూర్తి చేయడానికి రెండు రోజుల గడువు ఇచ్చారు. ఓటరు జాబితా పనులు వేగంగా, పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా జరుగుతున్నాయని, ప్రజలందరికీ సకాలంలో జాబితా అందుబాటులో ఉంటుందని కమిషనర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో కమిషనర్ తో పాటు అసిస్టెంట్ కమిషనర్ డి. భవాని బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి. సీతారాం, మున్సిపల్ మేనేజర్ పి. ప్రసాద్ రావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వి. జగదీశ్వరరావు, మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిలెటిన్ స్టిక్స్ పేలి ఘోర ప్రమాదం - ఐదుగురు దుర్మరణం.







**సహాయక చర్యలు చేపట్టిన అధికారులు.**

**అనంతగిరి,అక్టోబర్ 24 ( మీ వార్త )** ?అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో ఘోర ప్రమాదం సంభవించింది.పినకోట ప్రాంతంలో జరిగిన భారీ జిలెటిన్ స్టిక్స్ పేలుడు దుర్ఘటనలో ఒక ఉపాధ్యాయురాలు,డ్రైవర్,ముగ్గురు కార్మికులు సహా మొత్తం ఐదుగురు దుర్మరణం పాలయ్యారు.నిబంధనలకు విరుద్ధంగా భద్రతా ప్రమాణాలు పాటించకుండా జరిపిన అనధికారిక  పనులే ఈ ప్రాణనష్టానికి కారణమన్న ఆరోపణలు తీవ్రంగా వ్యక్తమవుతున్నాయి.?పినకోట పంచాయతీ పరిధిలోని పీచుమామిడి వద్ద రహదారి పనుల నిమిత్తం కొండలను తొలగించేందుకు గుత్తేదారుడు జిలెటిన్ స్టిక్స్ తెప్పించారు.వీటిని ఒక భారీ వాహనం వద్ద ఉంచగా,అదే సమయంలో వాహనంలో డీజిల్ నింపుతుండగా ఒక్కసారిగా జిలెటిన్ స్టిక్స్ పేలిపోయాయి.ఈ తీవ్రమైన పేలుడు ధాటికి వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పాఠశాలకు వెళ్లే క్రమంలో టిప్పర్‌లో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయురాలితో సహా అందరూ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.పేలుడు తీవ్రతకు మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా ఛిద్రమయ్యాయి.?ఈ దుర్ఘటనలో మృతి చెందిన వారి వివరాలను అధికారులు వెల్లడించారు.?సునీత విశాఖపట్నంకు చెందిన ఈమె,పినకోట పంచాయతీ మద్రేవు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.పాఠశాలకు వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. నారాయణరావు,చీడికాడకు చెందిన వ్యక్తి. మణి,కార్మికుడు.?పవన్ కుమార్,కడపకు చెందిన వ్యక్తి తో పాటు ?వాహన డ్రైవర్ మృతి చెందారు. సమాచారం అందుకున్న వెంటనే ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.అయితే,కొండలను తొలగించేందుకు ఎలాంటి భద్రతా నిబంధనలు పాటించకుండా, అనధికారికంగా జిలెటిన్ స్టిక్స్‌ను ఉపయోగించడం వల్లనే ఈ ఘోర ప్రమాదం జరిగిందని స్థానిక గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పెంటపాడు మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలన పూర్తి బరిలో 87 మంది

**పెంటపాడు, అక్టోబర్ 24 (మీ వార్త ప్రతినిధి)** స్థానిక ఎన్నికల్లో భాగంగా పెంటపాడు మండలంలో 92 మంది ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, పరిశీలన అనంతరం 87 మంది ఎన్నికల బరిలో నిలిచినట్లు రిటర్నింగ్ అధికారి ఎం. ప్రభాకర్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం. వెంకటేష్, తహశీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో నామినేషన్ల పరిశీలన చేశారు. మండల పరిధిలోని గ్రామాల నుండి జనసేన, వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా 92 మంది నామినేషన్లు దాఖలు చేశారని, పరిశీలనలో 5 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా 87 మంది బరిలో ఉన్నారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

# తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ 35 వార్డుల నుండి 48 వార్డులుగా విభజన

**1,00,728 మంది ఓటర్ల గుర్తింపు**

**మున్సిపల్ కమిషనర్ ఎం ఏసుబాబు**

**తాడేపల్లిగూడెం అక్టోబర్ 24 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో డీ-లిమిటేషన్ లో భాగంగా గతంలో ఉన్న 35 వార్డులను 48 వార్డులుగా విభజించారు. దీనికి సంబంధించిన ఓటరు జాబితాను సిద్ధం చేసి ప్రచురించారు. 48 వార్డులకు గాను మొత్తం 1,00,728 మంది ఓటర్లను గుర్తించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం. యేసుబాబు ఓటరు జాబితా తయారీ పనులపై సమీక్ష నిర్వహించారు. కులాల వారీగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీలలో స్త్రీ, పురుష వర్గీకరణతో కచ్చితమైన జాబితా రూపొందించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ పనులు పూర్తి చేయడానికి రెండు రోజుల గడువు ఇచ్చారు. ఓటరు జాబితా పనులు వేగంగా, పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా జరుగుతున్నాయని, ప్రజలందరికీ సకాలంలో జాబితా అందుబాటులో ఉంటుందని కమిషనర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో కమిషనర్ తో పాటు అసిస్టెంట్ కమిషనర్ డి. భవాని బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి. సీతారాం, మున్సిపల్ మేనేజర్ పి. ప్రసాద్ రావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వి. జగదీశ్వరరావు, మున్సిపల్



అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా డీజేలు పెట్టరాదు

**అనుమతులు లేకుండా డీజేలు ఏర్పాటు చేసిన వారిపై  కేసు నమోదు.**







**తల్లాడ, అక్టోబర్ 24 ( మీ వార్త విలేఖరి ):** ముద్దునూరు గ్రామంలోని రామాలయం గుడి సెంటర్‌లో బతుకమ్మ ఊరేగింపు సందర్భంగా రెండు వాహనాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేసి, అధిక శబ్దంతో పాటలు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందింది. అసభ్యకరంగా ఎగురుతూ, వాహనాలను ముందుకు వెనుకకు నడుపుతూ ప్రమాదకరంగా డీజే సౌండ్ పెడుతూ. డీజే లకు తగిన  అనుమతులు లేకపోవడంతో పాటు, ప్రజలకు ఇబ్బంది కలిగించిన ఈ ఘటనకు సంబంధించి డీజే నిర్వాహకులు, వాహన డ్రైవర్లు, డీజే ఆపరేటర్లు మరియు ఎలక్ట్రికల్ ఆపరేటర్లు మరియు నిర్వాహకులు పై తల్లాడ పోలీసులు కేసు నమోదు చేశారు.ఇజీ పాటు వాటిని అమర్చిన వాహనాలను సీజ్ చేసినారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేయడం, ప్రమాదకరంగా వాహనాలు నడపడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తల్లాడ ౹౫× గారు చెప్పినారు.

## తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ 35 వార్డుల నుండి 48 వార్డులుగా విభజన

**1,00,728 మంది ఓటర్ల గుర్తింపు**

**మున్సిపల్ కమిషనర్ ఎం ఏసుబాబు**

**తాడేపల్లిగూడెం అక్టోబర్ 24 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో డీ-లిమిటేషన్ లో భాగంగా గతంలో ఉన్న 35 వార్డులను 48 వార్డులుగా విభజించారు. దీనికి సంబంధించిన ఓటరు జాబితాను సిద్ధం చేసి ప్రచురించారు. 48 వార్డులకు గాను మొత్తం 1,00,728 మంది ఓటర్లను గుర్తించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం. యేసుబాబు ఓటరు జాబితా తయారీ పనులపై సమీక్ష నిర్వహించారు. కులాల వారీగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీలలో స్త్రీ, పురుష వర్గీకరణతో కచ్చితమైన జాబితా రూపొందించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ పనులు పూర్తి చేయడానికి రెండు రోజుల గడువు ఇచ్చారు. ఓటరు జాబితా పనులు వేగంగా, పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా జరుగుతున్నాయని, ప్రజలందరికీ సకాలంలో జాబితా అందుబాటులో ఉంటుందని కమిషనర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో కమిషనర్ తో పాటు అసిస్టెంట్ కమిషనర్ డి. భవాని బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి. సీతారాం, మున్సిపల్ మేనేజర్ పి. ప్రసాద్ రావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వి. జగదీశ్వరరావు, మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మాజీగూడెం గ్రామంలో ప్రచారంలో దూసుకుపోతున్న  కూటమి అభ్యర్థులు





మేజర్ పంచాయతీ ధర్మాజీగూడెం గ్రామంలో  టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు ఎంపీటీసీ 1  చల్లా మారుతీ దేవి ( నాగబాబు )ఎంపీటీసీ, 2  అభ్యర్థి ప్రియాంక చంద్ర మద్దత్తు గా కూటమి నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి  ఇంటింటికి వెళ్లి   కూటమి ప్రభుత్వం  చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.  రోడ్లు, త్రాగు నీరు,  మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఉచిత గ్యాస్  వంటి పలు పథకాలను  వివరిస్తున్నారు. 1 వ, 2 వ ఎంపీటీసీ  కూటమి అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపించాలని  ప్రజలను కోరారు . 1,2 ఎంపీటీసీ స్థానాలలో గెలుపు  మనదే నంటూ ధీమా  వ్యక్తం చేస్తూ ముమ్మర ప్రచార కార్యక్రమం నిర్వహించారు  .ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నిమ్మగడ్డ సుధాకర్, వేంపాటి ప్రసాద్,  మోరంపూడి ప్రసాద్,చెరువుగట్టు రామ్మోహన్ రావు, గజ్జా వెంకటేశ్వరరావు,  సొంగారాటాలు, పాతూరి శ్రీనివాస రావు,  కందుల కేశవరావు,  జనసేన అనిల్, పరసా రాజు, తనగాల యోహాను మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## భక్త జనసంద్రంతో కళకళ్ళాడిన జనార్ధన స్వామి వారి ఆలయం

**శనివారం,ఆశ్వయుజ శుద్ధ త్రయోదశి సందర్భంగా అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు**



ఆలమూరు, అక్టోబర్ 24(మీ వార్త ప్రతినిధి ) నవ జనార్దన ఆలయాల్లో నాలుగవ క్షేత్రమైన ఆలమూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి వారి ఆలయం శనివారం భక్తజన సందోహంతో కళకళ్లాడింది. సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు తరలివచ్చి క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ పుష్పాలంకరణలతో పాటు కామధేనువుల చిత్రాలను అటు ఇటు ధరించి స్వామి వారు గోవిందునిగా, భక్త జన కామధేనువుగా దర్శనమిచ్చారు. స్వామి వారి దివ్య రూపాన్ని తిలకించి భక్తజనం పులకితులయ్యారు. ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఈవో నరేంద్ర కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు అంగర భగవానాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సుమారు 2వేల మంది వరకు అన్న ప్రసాదాన్ని స్వీకరించారని అన్న ప్రసాద వితరణకు సహకరించిన దాతలకు, ఆలయంలో భక్తులకు సేవలు అందించిన సేవా సిబ్బందికి ఆలయ చైర్మన్ రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.

# దర్భగూడెం పంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తా.

### కూటమి అభ్యర్థి పద్దం వెంకటకృష్ణ..

**జీలుగుమిల్లి. (మీ వార్త ప్రతినిధి)** దర్భగూడెం గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి, ప్రజల ఉజ్వల భవిష్యత్తే ధ్యేయంగా కూటమి ఎంపీటీసీ అభ్యర్థిపద్దం వెంకటకృష్ణ నిలిచారు. ప్రజా సంక్షేమం, నిరంతర సేవే పరమావధిగా దూసుకుపోతున్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు , వెంకటకృష్ణను అభ్యర్థిగా నిలబెట్టి, దర్భగూడెం ప్రగతికి సరికొత్త బాటలు వేశారు. కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో పాటు, ఎమ్మెల్యే బాలరాజు ఆశీస్సులతో పద్దం వెంకటకృష్ణ విజయం దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్భగూడెం పంచాయతీ నీ అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్తానని ఆయన అన్నారు. తన గెలుపుతో దర్భగూడెం పంచాయతీ స్వరూపాన్నే మార్చేందుకు స్పష్టమైన ప్రణాళికలను సిద్ధం చేస్తామన్నారు. గ్రామంలోని ప్రతి వీధికి సిమెంట్ రోడ్ల నిర్మాణం మరియు పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తానని తెలిపారు. ప్రజల చెంతకే పాలన ఎప్పుడూ ప్రజా క్షేత్రంలో ఉంటూ దర్భగూడెం ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఏ చిన్న సమస్య వచ్చినా, తక్షణమే స్పందించి పరిష్కారం చేస్తామన్నారు. నన్ను గెలిపించండి -- అభివృద్ధిలో భాగస్వాములు అవ్వండి:
కేవలం ఎన్నికల కోసమే కాకుండా, రాబోయే రోజుల్లో దర్భగూడెం గ్రామాన్ని నియోజకవర్గంలోనే ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగ పనిచేస్తానని అన్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సహకారంతో మరిన్ని నిధులు తీసుకొచ్చి పంచాయతీని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కూటమి తరఫున నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు ప్రజలను కోరారు.



# సొంతగూటికి చేరిన వైసీపీ కుటుంబాలు




**కుకునూరు అక్టోబర్ 24 (మి వార్తా ప్రతినిధి)** వైసీపీ నుండి టీడీపీలోకి చేరిన పలు కుటుంబాలు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. కుక్కునూరు మండలంలోని సీఎం కాలనీలో మండల యూత్ ఉపాధ్యక్షుడు వేల్పుల రవి ఆధ్వర్యంలో 13 కుటుంబాలు తో పాటు ఇతర పార్టీ వారిని కుక్కునూరు మాజీ సర్పంచ్ ఎంపిటిసి.1 అభ్యర్థి అభ్యర్థి రావు వినోద్, ఇతర పార్టీ వారిని సాదరంగా ఆహ్వానించారు...
ఈ చేరికల్లో ప్రత్యేకంగా, నిన్న తెలుగుదేశం పార్టీలోకి వెళ్లినట్లు ప్రచారం జరిగిన వేల్పుల శ్రీను, తుంగ వీరబాబు, వేల్పుల లక్ష్మణ్ మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఒత్తిడి కారణంగా ఆ పార్టీ లోకి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. వేల్పుల శ్రీను, విషంపల్లి యశోద, గడ్డం రంగమ్మ, వేల్పుల చిన్న రమణ, గడ్డం లక్ష్మి, గడ్డం ప్రసాద్, దానూరు వెంకన్న బాబు, దానూరు శివ, వేల్పుల లక్ష్మణ్, వేల్పుల నాగరాజు, కౌలూరి రాజమ్మ, వేల్పుల ముత్యాలు, తుంగ వీరబాబు..ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజలతో మమేకమై పనిచేయడమే వైఎస్సార్సీపీ లక్ష్యమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు...ఈ కార్యక్రమంలో కుక్కునూరు మాజీ సర్పంచ అభ్యర్థి రావు వినోద్, జడ్పీటీసీ అభ్యర్థి చిలక రాణీ భాను ప్రసాద్, కూచర్లపటీ కృష్ణంరాజు, మాదిరాజు వెంకన్న బాబు, మల్లేలా చంటి నాయుడు, జక్క నాగేశ్వరరావు, వేల్పుల శ్రీనివాసరావు, ఎస్.కె. సలీం తదితరులు పాల్గొన్నారు...

# మాజీఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఇంకొందరిపైకోరుకొండ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు

**కోరుకొండ అక్టోబర్ 24 (మీ వార్తప్రతినిధి)**
తూర్పుగోదావరి జిల్లా, కోరుకొండ మండలం బుచ్చింపేట గ్రామానికి చెందిన ఏడుగురు అభ్యర్థులు పదవికి నామినేషన్లు దాఖలు చేసినట్లు వారిలో మెజారిటీ అభ్యర్థులు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో, ఎంపీటీసీ పదవిని ఏకగ్రీవం చేసుకునేందుకు వారంతా ఒప్పందం చేసుకున్నట్లు, సమాచారాన్ని రాజానగరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా జగన్నాథపురం గ్రామానికి చెందిన తన ముఖ్య అనుచరుడి ద్వారా తెలుసుకుని,సమాచారం తెలిసిన నేపథ్యంలో సమాచారం ఇచ్చిన అనుచరుడు ద్వారా బుచ్చింపేట గ్రామానికి చెందిన అనపర్తి మణికంఠ అనుఆసామిని రాజానగరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుచ్చింపేట పాతూరు సెంటర్ వద్దకు పిలిపించుకుని తన అనుమతి లేకుండా ఎందుకు ఏకగ్రీవానికి అంగీకరించినావు అని ప్రశ్నించి, మణికంఠ పై విచక్షణ రహితంగా దాడి చేసారని,ఆ దాడి పై తక్షణం స్పందించిన తూర్పుగోదావరి జిల్లా ఎస్పి డి.నరసింహ కిషోర్ (ఐపీఎస్ ) ఆదేశాల మేరకు దాడికి పాల్పడిన రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఇంకొందరిపై కోరుకొండ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందని నార్త్ జోన్ డిఎస్పి కుమారి సిహెచ్ జీవన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కేసును



కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వి బి ఎస్ మూర్తి పర్యవేక్షణలో కోరుకొండ సబ్ ఇన్స్పెక్టర్ ఆర్ శివాజీ దర్యాప్తు చేస్తున్నట్లు నార్త్ జోన్ డి.ఎస్.పి కుమారి సిహెచ్ .జీవన తెలిపారు, ఎలక్షన్స్ కోడ్ అమలో ఉన్నందున ప్రజలంతా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్( ఎన్సిసి ) కచ్చితంగా పాటించాలని, సెక్షన్ 163 బిఎన్ఎస్ సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలలో ఉన్నందున శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ప్రశాంతమైన వాతావరణం ఎన్నికల జరుగుటకు ప్రజలు సహకరించాలని ఎవరైనా శాంతి భద్రతకు విఘాతం కలిగే చర్యలకు పాల్పడితే వారి పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని నార్త్ జోన్ డి.ఎస్.పి కుమారి సిహెచ్ జీవన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వి వి ఎస్ మూర్తి, సబ్ ఇన్స్పెక్టర్ ఆర్ శివాజీ ఉన్నారు.

# ముస్లిం మదర్సా పాఠశాలలో వేమూరి ట్రస్ట్ సేవలు అభినందనీయం...

### బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ...

**మచిలీపట్నం, అక్టోబర్ 24 (మీ వార్త ప్రతినిధి)** వేమూరి వెంకటసుబ్బయ్య కుదరవల్లి సీతారామయ్య వేమూరి వెంకట రమేష్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మచిలీపట్నం రాజుపేట లోని మదర్స పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన మదర్సా పాఠశాలలలో వేమూరి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని అన్నారు. ఎక్కువ మంది నిరుపేద పిల్లలు చదువుకునే విద్యాసంస్థలను గుర్తించి వేమూరి వెంకట రమేష్ నగరంలో సేవా కార్యక్రమాలు కొనసాగించటం అభినందనీయమని అన్నారు. 200 మంది విద్యార్థులకు పుస్తకాలు పెనీలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ వేమూరి వెంకట రమేష్ మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం మానవసేవే మాధవ సేవ అని అందరూ శాంతియుత సహజీవనం తో కలిసి ఉండాలని అన్నారు.న్యాయవాది రాజేష్ మాట్లాడుతూ వేమూరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎందరో పేద విద్యార్థులకు సహాయం అందుతుందని పెద్దలు పేరుతో టెస్టులు ఏర్పాటు చేసి విద్యాదానం చేయటం



అభినందనీయమని అన్నారు. మచిలీపట్నం రాజుపేట మదారస్ దారుల్ ఉలుమ్ అష్ రఫియా పాఠశాల మరియు ఫైజాని హలీమి పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రబ్బాని హలీమి, అమీర్, భాజాని, శ్రీనివాసు, సింగ్ తదితరులు పాల్గొన్నారు..

## కొత్తూరులో దూసుకెళ్లిన కూటమి ప్రచారం.. గణపతికి ప్రజల నీరాజనం!

ఇంటింటా ప్రచారానికి అపూర్వ స్పందన.. సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి




**ఆలమూరు, అక్టోబర్ 24(మీ వార్త ప్రతినిధి )** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో ఆలమూరు మండలం ఎంపీటీసీ--1 పరిధిలోని కొత్తూరు గ్రామంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఎంపీటీసీ అభ్యర్థి కముజు గణపతి ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి గణపతి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకుని తమకు మద్దతు ఇవ్వాలని కోరారు.ప్రతి ఇంటి వద్ద గణపతికి ప్రజల నుంచి మంచి స్పందన లభించడంతో ప్రచారంలో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గణపతి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సైకిల్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గణపతిని గెలిపించాలని, తన విజయానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలను కోరారు. ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.. సైబర్ నేరాలపై జాగ్రత్త!

ఎటపాక ఎస్ఐ జి. అప్పలరాజు



**ఎటపాక, అక్టోబర్ 24 (మీ వార్త ప్రతినిధి):** యువత, విద్యార్థులు గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎటపాక ఎస్ఐ జి. అప్పలరాజు సూచించారు. శనివారం సాయంత్రం పోలవరం జిల్లా ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సెల్ఫోన్లకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. మహిళల భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింక్‌లను తెరవవద్దని, బ్యాంకు వివరాలు, ఓటీపీని ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వైసిపి తీర్థం పుచ్చుకున్న టిడిపి సీనియర్ నాయకులు బోయిడి సత్తిరాజు



**పాయకరావుపేట , మీ వార్త ప్రతినిధి,అక్టోబరు 24 :** మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బోయిడి సత్తిరాజు (రాజబాబు) వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులు చిక్కాల రామారావు సమక్షంలో శనివారం వైసిపిలోకి చేరారు. ఈ సందర్భంగా సత్తిరాజుకి చిక్కాల రామారావు పార్టీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గెడ్డమూరి శ్రీనివాసరావు, కోటవురట్ల మాజీ జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీలు తమ్మిర్సి సత్యనారాయణ, కొంతం నరేష్, సత్యవరం ఎంపీటీసీ అభ్యర్థిలు పాలపర్తి సతీష్, బోడపాటి నాగేశ్వరావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కర్రి వీరబాబు, గూటూరు వెంకటేశ్వరరావు, గూటూరు దొరబాబు పాల్గొన్నారు.

## పెడన మండలం కొంగ చర్ల గ్రామంలో వైసీపీలో చేరికలు




**కొంగంచెర్ల అక్టోబర్ 24:(మీ వార్త ప్రతినిధి)** పెడన మండలం కొంగంచర్ల గ్రామంలో శనివారం నాడు పలువురు కార్యకర్తలు వైసిపిలో చేరారు. మాజీ సర్పంచ్ ఫ్రాన్సిస్ కుమారుడు తో పాటు పలువురు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి ఉప్పాల రాము వీరిని పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపి నాయకుడు లోయ ఆంజనేయులు సమక్షంలో వీరు పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎంపీపీ అభ్యర్థి గరికపాటి రామానాయుడు వైసిపి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కొండవీటి నాగబాబు తదితరులు పాల్గొన్నారు

# అర్నబ్ తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

**ముందస్తు చర్యలు, సహాయక కేంద్రాల ఏర్పాటు, విద్యుత్, తాగునీరు, నిత్యావసర సరుకుల సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

**మచిలీపట్నం: అక్టోబర్ 24(మీ వార్త ప్రతినిధి)** అర్నబ్ తుపాను ముప్పును దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తుపాను సన్నద్ధతపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తుపాను తీరం దాటే ప్రాంతంపై స్పష్టత రావాల్సి ఉన్నందున, అత్యంత ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ నెల 27వ తేదీ నుంచి తుపాను హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో, ఈ నెల 26వ తేదీ రాత్రి నుంచి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా తమ తమ హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.ప్రమాదకర ప్రాంతాల ప్రజలను ముందుగానే గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, సహాయక కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వీలైనంత వరకు పోలింగ్ కేంద్రాలకు వేరుగా సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.చెట్లు కూలి రహదారులకు అంతరాయం కలగకుండా జేసీబీలు, పవర్ యంత్రాలు, ట్రాక్టర్లు సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ శాఖ అదనపు స్తంభాలు, కార్మిక బృందాలు, క్రేన్లు, ఇతర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగల వల్ల ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.విద్యుత్ అంతరాయం ఏర్పడినా తాగునీటి సరఫరా కొనసాగేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకులను ముందుగానే నింపాలని, మొబైల్ టవర్ల జనరేటర్లకు తగినంత డీజిల్ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. రేషన్ దుకాణాలకు నిత్యావసర సరుకుల రవాణాను వేగవంతం చేసి, ఆహార కొరత రాకుండా చూడాలన్నారు.మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, కాలువలు, డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించాలని ఆదేశించారు. గర్భిణులు, డయాలసిస్ రోగులు వంటి అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారిని ముందుగానే గుర్తించి



అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచాలని సూచించారు.అన్ని మండల, డివిజన్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, వాటి ఫోన్ నంబర్లను ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల ప్రాణాలను కాపాడటం, అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూడటం ప్రధాన లక్ష్యాలుగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# విద్యతో పాటు క్రీడలపై నైపుణ్యం పెంపొందించే విధంగా చర్యలు..





**రాష్ట్ర గిరిజన గురుకులం సంక్షేమ శాఖ కార్యదర్శి గౌతమి..**

**మారేడుమిల్లి,అక్టోబర్ 24(తెలుగు రాష్ట్రం ప్రతినిధి)** రాష్ట్రములోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలలో చదువుచున్న విద్యార్థులకు విద్యతోపాటు వివిధ రకాలైన ఆటల పోటీలలో నైపుణ్యం పెంపొందించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ గురుకులం కార్యదర్శి యం.గౌతమి పేర్కొన్నారు.శనివారం రంపచోడవరం మండలం పెద్దగెద్దడ గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను,మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ గురుకులాల కార్యదర్శి యం.గౌతమి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా రాష్ట్ర గురుకులాల గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వివిధ రకాలైన ఆటలు పోటీలు నిర్వహించేందుకు రంపచోడవరం మండలం పెద్ద గెద్దాడ లో నిర్వహించేందుకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె తెలిపారు. రాష్ట్రంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యతోపాటు వివిధ రకాలైన ఆటల పోటీలలో ప్రతిభాలు కనబరిచే విధంగా త్వరలో ఒక స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.గురుకుల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజు మెనూ అమలు చేయాలని అదేవిధంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు విద్య బోధన చేయాలని ఆమె తెలిపారు.కార్యదర్శి వారి వెంట ప్రిన్సిపాల్ దేవేంద్ర శర్మ, గురుకులం సెల్ అధికారి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమగోదావరి జిల్లా జడ్పీటీసీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులతో నామినేషన్లు వేయించిన కేబీఆర్ నాయుడు, అంకెం సీతారాం

**భీమవరం అక్టోబర్ 24 మీ వార్త జిల్లా ప్రతినిధి.** జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసిన నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియలో మాజీ స్టేట్ ఫార్మ్స్ చైర్మన్ కేబీఆర్ నాయుడు, పశ్చిమగోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అంకెం సీతారాం కీలకంగా వ్యవహరించారు. మిత్రపక్షాల నాయకులతో కలిసి, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్న అన్ని జడ్పీటీసీ స్థానాల్లో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేలా వారు దగ్గరుండి పర్యవేక్షించారు. దీంతోపాటు జిల్లాలోని పలు ఎంపీటీసీ స్థానాల్లో కూడా అభ్యర్థులతో నామినేషన్లు వేయించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం, మిత్రపక్షాల సమన్వయంతో ఎన్నికల బరిలో ముందుకు సాగడమే లక్ష్యంగా నాయకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో, రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, మిత్రపక్షాల శ్రేణులు తమ కార్యాచరణను కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు.




# తాడేపల్లిగూడెం మండలంలో వైఎస్సార్సీపీ ఎన్నికల ప్రచారం



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 24 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం రూరల్ మండలంలోని మెట్ట ఉప్పరగూడెం, ఇటుకలగుంట, అమృతపురం గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ వడ్డీ రఘురాం నాయుడు బలపరిచిన జెడ్పీటీసీ అభ్యర్థి సబ్బితి బ్రహ్మయ్య మహతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సతీమణి సబ్బితి చిన్నమ్మ, ఎంపీటీసీ అభ్యర్థి వీరమల్లు సుబ్రహ్మణ్యం సతీమణి వీరమల్లు వరలక్ష్మితో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ లో శ్రీ ప్రకాష్ విద్యార్థి ప్రతిభ



**పాయకరావుపేట, మీ వార్త ప్రతినిధి,అక్టోబరు 24 :** ఈ నెల 23 న విశాఖపట్నం, కొమ్మాదిలో జరిగిన పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలకు చెందిన ఇ దుర్వేష్ (పదవ తరగతి) అండర్-19 విభాగంలో జరిగిన పరుగు పోటీల్లో 100 మీటర్ల దూరాన్ని కేవలం 12 సెకన్లలో పూర్తి చేసి ప్రథమ స్థానాన్ని సాధించి ఈ నెల 27 న కర్నూలులో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ప్రతిభ కనబరచిన విద్యార్థిని విద్యా సంస్థల అధినేత సిహెచ్ వి కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి, ప్రధానోపాధ్యాయులు డివి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు అభినందించారు.

## ఇండియా కూటమి జడ్పిటీసీ అభ్యర్థిగా బి పారమ్ సమర్పించిన --ప్రతాప్



**రాజోలు, అక్టోబర్ 24 ( మీ వార్త విలేఖరి)** ఇండియా కూటమి నుండి సఖినేటిపల్లి జడ్పిటిసి అభ్యర్థిగా అప్పనరామునిలంక మాజీ సర్పంచ్ తోటే ప్రతాప్ శనివారం అమలాపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి బి పారమ్ సమర్పించారు.ఈ మేరకు వివరాలలోకి వెళ్ళితే రాజోలు నియోజకవర్గ దళిత సంఘాల జేఏసీ, ప్రజా సంఘాలు, అంబేద్కర్ సంఘాలు మద్దత్తుతో సఖినేటిపల్లి జనరల్ జడ్పిటిసి స్థానానికి తోటే ప్రతాప్ పోటీ పడుతున్నారు. సర్పంచ్ గా పని చేసిన సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పాటుగా ప్రజా, దళిత సంఘాలలో సమస్యలపై పోరాటం చేసిన ఉద్యమ స్ఫూర్తి ఉండటం అనేవి తోటే ప్రతాప్ కు కలిసొచ్చే అంశాలుగా చెప్పవచ్చు. దీనితో పాటుగా ఇండియా కూటమిలోనున్న కాంగ్రెస్, సీపీఐ, సిపిఎం, విసికే పార్టీలు మద్దత్తు కుడా తోటే ప్రతాప్ కు ఉండటం కూడా మరింత బలం చేకూరే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అన్నీ సామాజిక వర్గ ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండే వ్యక్తిగా సఖినేటిపల్లి మండల ప్రజల్లో తోటే ప్రతాప్ కు మంచి గుర్తింపు ఉండటం విశేషం.సఖినేటిపల్లి జెడ్పిటిసి ఎన్నికలను ఏమేరకు తోటే ప్రతాప్ ప్రభావితం చేస్తారో ఎదురు చూడాల్సిందే.

## వెండి రథంపై ఊరేగనన్న వాసవి మాత



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 24 (మీ వార్త ప్రతినిధి)**తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్ లో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో వాసవి మాత సుమారు 450 కిలో ల వెండితో చేసిన రథంపై పట్టణ పురవీధులలో ఊరేగనున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుండి ఆలయం వద్ద పూజాది క్రతువులు నిర్వహించిన తర్వాత పట్టణంలోని ప్రధాన రహదారులలో అమ్మవారి రథోత్సవం వైభవంగా జరగనుంది. ఆరు రాష్ట్రాలకు చెందిన 225 మంది కళాకారులతో ఇప్పటివరకు ఎక్కడ కనివిని ఎరగని రీతిలో వివిధ రకాల కళాకారులతో అమ్మవారి రథోత్సవం జరుగుతుందని రథోత్సవ కమిటీ చైర్మన్ నారాయణ రాంబాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. గౌరవాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ వబిలిశెట్టి నటరాజ్ ల పర్యవేక్షణలో శ్రీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొర్లపర రాము, కార్యదర్శి సుందర రావు, కోశాధికారి బోగవల్లి రమేష్ ఆలయ కార్యదర్శులు, వాసవి క్లబ్ సభ్యులు, వనిత క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య మహిళా సంఘం, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, ఐ వి ఎఫ్ నాయకులు సహాయ సహకారాలతో ఈ కార్యక్రమంలో నిర్వహించబడుతుందని తెలియజేశారు.

## ప్రచారంలో కొత్తపల్లి సుబ్బారాయుడు.భుజంగ రాయులు నాని. చైర్మన్ అభ్యర్థి కొత్తపల్లి శైలజ





**నరసాపురం అక్టోబర్ 24 మీ వార్త జిల్లా ప్రతినిధి.**నర్సాపురం రాజకీయం వేడెక్కింది కూటమి చైర్మన్ అభ్యర్థి తరుపు ప్రచారంలో పలు వార్డులలో బుల్లెట్ స్పీడ్ తో ప్రజలతో మమేకమవుతూ కూటమి విజయం కోసం రాజకీయ చతురత కలిగిన రాజకీయాలలో ఆయువు పట్టుతెలిసిన మహోన్నత వ్యక్తిగా కొత్తపల్లి సుబ్బారాయుడు చదరంగం మొదలుపెట్టారు.ఈ చదరంగంలో ఒక్కొక్క మెట్టు ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ నరసాపురం 36 వార్డులలో ప్రచారం హోరెత్తించారు ఒక పక్క సుబ్బారాయుడు తనయుడు కొత్తపల్లి నాని. మరొక పక్క చైర్మన్ అభ్యర్థి కొత్తపల్లి శైలజ. ప్రచారంలో హోరెత్తిస్తున్నారు ముఖ్యంగా చైర్పర్సన్ అభ్యర్థి కొత్తపల్లి శైలజా 15వ వార్డు కొత్తపల్లి సుబ్బారాయుడు 29వ వార్డు కొత్తపల్లి నాని 27వ వార్డు లలో విభిన్న రీతిలో ప్రచారం హోరెత్తించారు కొత్తపల్లి సుబ్బారాయుడు రాజకీయ చతురతతో తన ఆలోచన విధానంతో దూసుకుపోతున్నారు. జనసేన చైర్మన్ అభ్యర్థి విజయం తథ్యమని కొత్తపల్లి సుబ్బారాయుడు వ్యాఖ్యానించారు ఈ కార్యక్రమంలో బిజెపి టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తుఫాను, భారీ వర్షాల వేళ ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి

అక్టోబర్ 27, 28 తేదీల్లో అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయవద్దు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.

పునరావాస కేంద్రాలు, కంట్రోల్ రూమ్‌లను సిద్ధం చేయాలి.

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

**భీమవరం అక్టోబర్ 24 మీ వార్త జిల్లా ప్రతినిధి.** అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, తుఫాను, వరదల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శనివారం గూగుల్ మీటింగ్ ద్వారా రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, ట్రాన్స్‌కో, విద్య, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, వ్యవసాయ, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తదితర శాఖల అధికారులతో తుఫాను, భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, పిడుగులు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని, అత్యవసర సేవలకు అవసరమైన సిబ్బంది, పరికరాలు, సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు తెలిపారు.
లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడ నివసిస్తున్న ప్రజలను అవసరమైన సందర్భాల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ముఖ్యంగా లంక గ్రామాల్లోని వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అవసరమైన పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, అక్కడ తాగునీరు, పాలు, ఆహారం, వైద్య సేవలు, పారిశుద్ధ్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
కంట్రోల్ రూమ్‌లు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలి. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఫోన్ అబఎవత్ 08816299181 ఏర్పాటు చేయడంతో పాటు, అన్ని మండల కేంద్రాల్లో ఇప్పటికే ఉన్న కంట్రోల్ రూమ్‌లను అప్రమత్తం చేయాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అత్యవసర సమాచారంపై వెంటనే స్పందించేలా సిబ్బందిని అందుబాటులో ఉండాలని తెలిపారు.
తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. తుఫాను, వరదల సమయంలో ఏ ఒక్కరూ ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

**కాలువలు, డ్రైనేజీలను ముందుగానే శుభ్రం చేయాలి.**
భారీ వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండకుండా ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలువలు, డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక, తూడు, తూటికాడ తదితర అడ్డంకులను తొలగించి, వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చూడాలన్నారు.
నీరు నిల్వ ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడ నీటి నిల్వను నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా మోటార్లు, ఇతర అవసరమైన పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

**రోడ్లపై రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు.**
భారీ వర్షాల వల్ల జాతీయ రహదారులు, ప్రధాన రహదారులు, ఇతర రహదారులు దెబ్బతిన్నా, నీటితో మునిగినా వెంటనే స్పందించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సంబంధిత రహదారుల శాఖ అధికారులకు తెలిపారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా రహదారుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రమాదకర ప్రాంతాల వద్ద అవసరమైన హెచ్చరికలు ఏర్పాటు చేయాలని సూచించారు.

**ద్యుత్, తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకూడదు.**
భారీ వర్షాలు, తుఫాను సమయంలో తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తీగలు దెబ్బతినే ప్రమాదం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు వెంటనే పునరుద్ధరించేలా సిబ్బంది, పరికరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. తుఫాను సమయంలో పారిశుద్ధ్య సిబ్బంది విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.
జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన నీటి నిల్వలు, ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు.

**పాఠశాలలు, కళాశాలల విషయంలో ముందస్తు చర్యలు.**
అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే అంశంపై నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. అన్ని ఇంజినీరింగ్ కళాశాలలు సహా ఇతర విద్యాసంస్థలకు కూడా పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు సమాచారం అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

**రైతుల పంటలకు నష్టం కలగకుండా జాగ్రత్తలు.**



భారీ వర్షాల కారణంగా వ్యవసాయ భూముల్లో నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట్ల నీరు బయటకు వెళ్లేందుకు వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.
పంట పొలాలు ముంపునకు గురికాకుండా, రైతులు నష్టపోకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.

**మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దు**

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లవద్దని తెలిపారు. సముద్రంలో వాతావరణ పరిస్థితులపై సంబంధిత శాఖలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, మత్స్యకారులకు హెచ్చరికలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని తెలిపారు.

**పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి**
భారీ వర్షాల అనంతరం వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శానిటేషన్ సిబ్బందికి అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలను నిరంతరం శుభ్రం చేయాలని తెలిపారు.

**అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వద్దు.**
అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులు మినహా ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉరుములు, మెరుపులు, పిడుగులు సంభవించే సమయంలో బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో తుఫాను, భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## చవ్వకుల నరసింహారావు కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం ; అక్టోబర్ 24 మీ వార్త జిల్లా ప్రతినిధి.** భీమవరం ఫ్యాడి అండ్ రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు చవ్వకుల నరసింహారావు కుటుంబ సభ్యులను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) శనివారం పరామర్శించారు. నరసింహారావు కుమారుడు సత్యనారాయణ ఇటీవలే మృతి చెందారు. వారి చిత్రపటానికి ఎమ్మెల్యే అంజిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగడ సానుభూతిని తెలియజేశారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలి

మాజీ ఎమ్మెల్యే వైసిపి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాద్ రాజు



**నరసాపురం అక్టోబర్ 24 మీ వార్త జిల్లా ప్రతినిధి.** నరసాపురం మున్సిపల్ ఎన్నికలలో వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు 6,7,21 వార్డులలో సుడిగాలి ప్రచారం నిర్వహించారు. పార్టీ మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి కావలి రామసీత, వార్డు సభ్యులు పతివాడ మార్కేండేయులు, కామన బుజ్జి లను గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు వైసిపి ఎన్నికల ప్రచారానికి ప్రజలనుంచి మంచి స్పందన లభించింది.

## ఎన్డీయే కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థిను అఖండ మెజారిటీతో గెలిపించాలి

కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ టిడిపి రాష్ట్ర సీనియర్ నాయకులు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు



**నరసాపురం అక్టోబర్ 24 మీ వార్త జిల్లా ప్రతినిధి.** నరసాపురం 14వ వార్డులో ఎన్డీయే కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థినుల తరపున ముమ్మర ప్రచారం నిర్వహించిన కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు శ్రీ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు!
గాజు గ్లాస్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి..
మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిని: కొత్తపల్లి శైలజ జానకీరామ్ ని
14వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిని: తోట సూర్యకుమారి నాని, ని అఖండ మెజారిటీతో గెలిపించి, అభివృద్ధి పథంలో సాగుతున్న కూటమి ప్రభుత్వంలో భాగస్వాములు కావాలని కోరారు. వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో సంకు భాస్కర్ నాయుడు, భూపతి నరేష్, మల్లాడి మూర్తి, గుడాల సునీత నాని, ముస్కోడి రవి, మౌలాలి, రావి అప్పాజీ మరియు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, కొవ్వలి ఫాలోవర్స్, మహిళలు మరియు స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించి చికిత్స పొందాలి

సూపర్వైజర్ మేరీ



**ఇందల్వాయి: :** మండలంలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో సూపర్వైజర్ మేరీ పాల్గొని ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ చరిత్రలో కుష్టు వ్యాధి ప్రాచీన వ్యాధుల్లో ఒకటని, వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలో గుర్తించి చికిత్స పొందడం ఎంతో ముఖ్యమని తెలిపారు. శరీరంపై తెలుపు, రాగి లేదా ఎరుపు రంగులో కనిపించే మచ్చలతో పాటు, ఆ ప్రాంతంలో స్పర్శజ్ఞానం తగ్గడం లేదా పూర్తిగా కోల్పోవడం కుష్టు వ్యాధి లక్షణాలు కావచ్చని వివరించారు. నరాలు లావుగా మారడం, నొప్పి కలగడం, చేతులు, పాదాల్లో స్పర్శజ్ఞానం కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజలు సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని ఆమె కోరారు. గతంలో కుష్టు వ్యాధికి చికిత్స పొందినవారు, అంగవైకల్యం కలిగిన బాధితులు సమీప ఆరోగ్య కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా అంగవైకల్య నివారణకు సంబంధించిన సేవలు, ఇతర వైద్య సదుపాయాలు పొందవచ్చని తెలిపారు. కుష్టు వ్యాధికి చికిత్స పొంది కోలుకున్నవారికి పునరావాసం కల్పించడం ద్వారా సమాజంలో గౌరవప్రదమైన జీవితం అందించవచ్చని పేర్కొన్నారు. వ్యాధిపై అపోహలు వీడి, బాధితుల పట్ల వివక్ష చూపకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు జ్యోతి, గంగమణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**వేతనాలు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్‌కు పిలుపు**




**ఇందల్వాయి:** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారి వేతనాలను పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. చాలాకాలంగా ఆశా వర్కర్లు వెట్టిచాకిరీ చేస్తున్నప్పటికీ, వారి సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా వారి సమస్యలపై స్పందించకపోవడం విచారకరమని ఆశా వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

## పరిశీలన అనంతరం ఎంపిటిసి నామినేషన్ల వివరాలు

**ఏలూరు అక్టోబర్ 24 (మి వార్తా ప్రతినిధి)** మొత్తం ఎంపిటిసి స్థానాలు – 454 మొత్తం దాఖలైన నామినేషన్లు -- 2423
పరిశీలన అనంతరం తిరస్కరించినవి -49
పరిశీలన అనంతరం మండలాల వారీగా తిరస్కరించినవి
పెదవేగి మండలంలో 17, పెదపాడు మండలంలో 7, ద్వారకా తిరుమల, పోలవరం మండలాల్లో 6 చొప్పున, ఉంగుటూరు మండలంలో 3, కుక్కునూరు మండలంలో 2, భీమడోలు, చాట్రాయి, చింతలపూడి, దెందులూరు, ఏలూరు, కైకలూరు, కొయ్యలగూడెం, నూజివీడు మండలాల్లో ఒకొక్కటి చొప్పున ఎంపిటిసి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. తిరస్కరణ అనంతరం 2374 నామినేషన్లు అంగీకరించారు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Agiripalli | 91 | 91 | 0 | 91 | 0 | |
| 2 | Bhimadole | 100 | 100 | 0 | 99 | 1 | Witness Signatures Missing in Candidate Decleration Form |
| 3 | Buttaigudem | 82 | 82 | 0 | 82 | 0 | |
| 4 | Chatrai | 84 | 84 | 0 | 83 | 1 | He is disqualified under Sec.18(1) read with sections 156(2) and 184(2) of APPR Act, 1994. He is working as a Data Entry Operator (Out Sourcing ) in APSWR School for Boys Pedavegi GP and Mandal |
| 5 | Chintalapudi | 122 | 122 | 0 | 121 | 1 | The individual filed 2 nominations in various days. At the time of Scrutiny process one Nomination is accepted and another one is rejected. |
| 6 | Denduluru | 87 | 87 | 0 | 86 | 1 | |
| 7 | Dwaraka Tirumala | 91 | 91 | 0 | 85 | 6 | 4 Signature Missing in Candidates Decleration Form 1 Signature Missing in Nomination form 1 Proposer's Vote Was not in the same Segement |
| 8 | Eluru | 63 | 63 | 0 | 62 | 1 | MPTC segment reserved for Backward Classess but the Nomination Filed Candidate belongs to Scheduled Caste |
| 9 | Jangareddygudem | 91 | 91 | 0 | 91 | 0 | |
| 10 | Jeelugumilli | 54 | 54 | 0 | 54 | 0 | |
| 11 | Kaikaluru | 128 | 128 | 0 | 127 | 1 | Dummy Candidate, Proposed to 2-Candidates |
| 12 | Kalidindi | 121 | 121 | 0 | 121 | 0 | |
| 13 | Kamavarapukota | 110 | 110 | 0 | 110 | 0 | |
| 14 | Koyyalagudem | 114 | 114 | 0 | 113 | 1 | Praposed Person vote not in the MPTC segment |
| 15 | Kukunoor | 55 | 55 | 0 | 53 | 2 | The individual filed 2 nominations in various days and remited only single deposit. At the time of Scrutiny process one Nomination is accepted and another one is rejected. (Both Cases) |
| 16 | Lingapalem | 78 | 78 | 0 | 78 | 0 | |
| 17 | Mandavalli | 74 | 74 | 0 | 74 | 0 | |
| 18 | Mudinepalli | 100 | 100 | 0 | 100 | 0 | NIL |
| 19 | Musunuru | 73 | 73 | 0 | 73 | 0 | |
| 20 | Nidamarru | 68 | 68 | 0 | 68 | 0 | |
| 21 | Nuzvid | 102 | 102 | 0 | 101 | 1 | Working as Asha Worker in Annavaram Panchayat |
| 22 | Pedapadu | 99 | 99 | 0 | 92 | 7 | |
| 23 | Pedavegi | 129 | 129 | 0 | 112 | 17 | |
| 24 | Polavaram | 60 | 60 | 0 | 54 | 6 | 1.) Since the candidate is a proposer for the nomination of one within this same territorial constituency. 2.) The candidate's name is not in the electoral roll, and the security deposit has not been paid. 3.) 2 Members The security deposit for the nomination had not been paid. 4.) 2 Members The proposer's name did not match the electoral roll. |
| 25 | T. Narasapuram | 107 | 107 | 0 | 107 | 0 | NIL |
| 26 | Unguturu | 108 | 108 | 0 | 105 | 3 | 1.The first two nominations (Serial Numbers 47 and 84) were submitted by candidate Venkata Sai Lakshmi Ramena for the Unguturu-1 MPTC segment and were both rejected due to an Endorsement Board member status, which constitutes a disqualifying conflict of interest under local body election guidelines. 2. The third nomination (Serial Number 93) was submitted by candidate Putsakayala Sambhavi for the Gopinadhapatnam segment and was rejected because the candidate is running a Fair Shop as a PDS Member, a government-licensed utility position that legally bars individuals from contesting elections unless they resign from the role before filing. 3. Seven Duplicate(Second set) Nominations (treated as invalid) only one valid primary nomination set is ultimately accepted to move forward for that candidates |
| 27 | Velairpad | 32 | 32 | 0 | 32 | 0 | NIL |
| | Total | 2423 | 2423 | 0 | 2374 | 49 | |

## రెడ్డి సూరిబాబును పరామర్శించిన వడ్డీ రఘురాం నాయుడు



**పెంటపాడు అక్టోబర్ 24 (మీ వార్త ప్రతినిధి)** మండలం లోని పెంటపాడు గ్రామానికి చెందిన రెడ్డి సూరిబాబు హార్ట్ స్టంట్ వేయించుకున్న విషయం తెలుసుకుని, తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వడ్డీ రఘురాం నాయుడు శనివారం రెడ్డి సూరిబాబు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్రెల శ్రీను నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# అడవి నేపథ్యంలో 'సింగ'

హీరో గోపీచంద్ మరోసారి తనదైన మాస్ అవతారంలో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన నటిస్తున్న తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సింగ' శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఈ చిత్రం ద్వారా యాక్షన్ కొరియోగ్రాఫర్ వి.వెంకట్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. మలయాళ నటి అనార్కలి నాజర్ కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమా షూటింగ్ యాభైశాతం పూర్తయింది. ఈ సందర్భంగా శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో గోపీచంద్ చేతిలో భారీ ఆయుధాన్ని ధరించి శక్తివంతంగా కనిపిస్తున్నారు. అడవి నేపథ్యంలో నడిచే కథాంశమిదని, ప్రత్యేకంగా నిర్మించిన ఫారెస్ట్ సెట్‌లో కీలక సన్నివేశాలను తెరకెక్కించామని, డిసెంబర్‌లో తదుపరి షెడ్యూల్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు. ఇంటెన్స్ యాక్షన్, ఎమోషన్స్ కలబోతగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, గోపీచంద్ పాత్ర సరికొత్త పంథాలో ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: సామ్ సీఎస్, రచన-దర్శకత్వం: వి.వెంకట్.

# కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టా!

ఇటీవలే 'ది ప్యారడైజ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది అస్సామీ సొగసరి కయాదు లోహర్. ప్రస్తుతం ఈ భామ దక్షిణాదిన భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. అందులో మారి సెల్వరాజ్ దర్శకత్వంలో నటిస్తున్న తమిళ చిత్రం 'మంజనాతి' ఒకటి. మహిళా ప్రధాన కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా తనను వ్యక్తిగతంగా ఎంతో ప్రభావితం చేసిందని కయాదు లోహర్ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా ఆనందం వ్యక్తం చేసింది. దర్శకుడు మారి సెల్వరాజ్‌తో కలిసి ఖాళీ రహదారిపై నడుస్తున్న ఫొటోను షేర్ చేసింది. 'నటిగా నేను విభిన్నమైన ప్రపంచంలోకి అడుగుపెట్టా. ఇదొక కొత్త పాఠశాల. నా వ్యక్తిత్వానికి ఎంతో దగ్గరైన పాత్ర ఇది. ఈ ప్రయాణంలో భాగం కావడం సంతోషంగా ఉంది' అని కయాదు లోహర్ తన పోస్ట్‌లో పేర్కొన్నది. ఈ చిత్రంలో మరో నాయికగా ప్రియాంక మోహన్ నటిస్తున్నది. ఇళయరాజా సంగీతాన్నందిస్తున్నారు.





# మన బట్టలు, మన ఇష్టం.. కామెంట్ చేసే హక్కు వాళ్లకు ఎవరిచ్చారు?: కృతి సనన్ ఫైర్!

బాలీవుడ్‌లో మహిళలపై జరుగుతున్న ట్రోలింగ్ మరియు లింగ వివక్షపై ప్రముఖ నటి కృతి సనన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కరీనా కపూర్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'వాట్ విమెన్ వాంట్' షోలో పాల్గొన్న ఆమె, తన దుస్తులపై జరిగిన అనవసర రాద్ధాంతం గురించి ఓపెన్‌గా మాట్లాడారు. ఇటీవల ఒక ప్రకటనలో తాను ధరించిన డ్రెస్ జాతీయ స్థాయిలో చర్చనీయాంశం కావడం, ఏకంగా ప్రైమ్‌టైమ్ న్యూస్ డిబేట్లు జరగడం తనను తీవ్రంగా షాక్‌కు గురిచేసిందని కృతి తెలిపారు. సాధారణంగా ఇలాంటి విమర్శలను తాను పట్టించుకోనప్పటికీ, మహిళలను చిన్న విషయాలకే టార్గెట్ చేయడం పెరిగిపోవడంతో స్పందించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మహిళలు ఎలాంటి దుస్తులు ధరించాలనేది పూర్తిగా వారి వ్యక్తిగత స్వేచ్ఛ అని, ఇతరులకు ఆ హక్కు ఎవరిచ్చారని కృతి నిలదీశారు. లావుగా ఉన్నా, సన్నగా ఉన్నా, కాస్త బరువు పెరిగినా బాడీ షేమింగ్ చేయడం, అనవసరమైన కామెంట్లు విసరడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా నెగెటివిటీని తట్టుకోలేక కామెంట్ సెక్షన్ ఆఫ్ చేసేయమని సోదరి సలహా ఇచ్చినా, ఎవరికీ భయపడి తాను వెనక్కి తగ్గేది లేదని తేల్చిచెప్పారు. కృతి ధైర్యవంతమైన వ్యాపార వైఖరిని కరీనా కపూర్ ఖాన్ పూర్తిగా సమర్ధించారు. చిన్నపాటి శారీరక మార్పులకు కూడా జనం ముందు వివరణ ఇచ్చుకోవాల్సిన దుస్థితి నేడు నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తూ, కృతి స్పందించిన తీరు ఎంతో అభినందనీయమని ప్రశంసించారు.



# స్త్రీ సామ్రాజ్య నాయకి

అధికారం, వారసత్వం, ప్రతీకారం నేపథ్యంతో సాగే గ్యాంగ్‌స్టర్ కథాంశంతో రూపొందిన వెబ్‌సిరీస్ 'అక్క'. ఇందులో మాతృస్వామ్య సామ్రాజ్యానికి నాయకత్వం వహించే 'భవానీ అక్క'గా కీర్తి సురేశ్ నటించారు. రాధికా ఆప్టే కీలకపాత్రధారి. యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ వెబ్‌సిరీస్‌కు ధర్మరాజ్‌శెట్టి దర్శకుడు. ఈ నెల 30న నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానున్నది. ఈ సందర్భంగా ఈ సిరీస్ ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. తరతరాలుగా మహిళలే ముందుండి నడిపిస్తూ, తమ అధికారాన్ని, ఆధిపత్యాన్ని కాపాడుకుంటున్న పేర్రూరు అనే రాజ్యంలో జరిగే ఆసక్తికరమైన అంశాల చుట్టూ ఈ సిరీస్ నడుస్తుందని ట్రైలర్ చెబుతున్నది. వారసత్వానికీ, ఆధిపత్యానికీ మధ్య పోరాటంగా ఈ సిరీస్ సాగుతుందని, ఇద్దరు శక్తివంతమైన మహిళల మధ్య సాగే పోరాటమే ఈ సిరీస్ అని మేకర్స్ తెలిపారు. వారసత్వాన్ని కాపాడుకునేందుకు ఎంతదూరమైన వెళ్లే వ్యక్తిగా ఇందులో కనిపిస్తానని, ఇది సవాళ్లతో కూడుకున్న పాత్ర అని, కథ సాగే కొద్దీ తన పాత్రలో విభిన్న కోణాలు చూస్తారని కీర్తి సురేశ్ తెలిపారు. తన్వీ ఆజ్మీ, మహేశ్ మంజ్రేకర్, అన్నుమన్ పుష్కర్, మోనికా పన్వార్ ఇందులో ఇతర పాత్రధారులు.

# పాకిస్థాన్ ఏజెంట్ ఇండియా వస్తే..

నటీనటులు: ఆయుష్మాన్ ఖురానా, సారా అలీఖాన్, ముకుల్ దేవ్, గుల్షన్ గ్రోవర్, రామ్ కపూర్, రాహుల్ బోస్, బ్రిజేంద్ర కాల్ తదితరులు
దర్శకత్వం, రచన: ఆకాశ్ కౌశిక్
నిర్మాతలు: కరణ్ జోహార్, అదార్ పూనావాలా, గునీత్ మోంగా, అపూర్వ మెహతా, అచిన్ జైన్
విడుదల తేదీ: 23-10-2026
జానర్: స్పై యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్

**కథ**

భారత యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్‌లో విక్రాంత్ (ఆయుష్మాన్ ఖురానా) ఒక కీలకమైన ఏజెంట్. ఉగ్రవాది మసూద్ అజార్ (ముకుల్ దేవ్) దేశంలో అలజడి సృష్టించేందుకు వేసిన పన్నాగాన్ని విక్రాంత్ అడ్డుకుంటాడు. అయితే మసూద్‌ను పట్టుకునే ప్రయత్నంలో విక్రాంత్ సరిహద్దులు దాటి పాకిస్థాన్‌లోకి అడుగుపెడతాడు. అక్కడ ఊహించని విధంగా పాక్ ఆర్మీ అతడిని తమ అత్యంత నమ్మకస్థుడైన ఏజెంట్ 'బిలాల్ అహ్మద్'గా ప్రకటిస్తుంది. తిరిగి భారతదేశానికి వచ్చాక విక్రాంత్ ప్రవర్తనపై ఏటీఎస్ చీఫ్ ఆర్డీ బర్మన్ (రాహుల్ బోస్)కు అనుమానం కలుగుతుంది. సరిగ్గా అదే సమయంలో జరిగిన ఒక కారు ప్రమాదంలో విక్రాంత్ తలకు బలమైన గాయమై తన గతం పూర్తిగా మరచిపోతాడు. పాకిస్థాన్ పన్నిన కుట్ర ఏంటి? గతం మరిచిన ఆ ఏజెంట్ ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నాడు? చివరకు ఏం జరిగిందనేదే ఈ చిత్ర కథ.

**విశ్లేషణ**

ఇటీవల కాలంలో వచ్చిన స్పై థ్రిల్లర్లకు పూర్తి భిన్నంగా, సరికొత్త కామెడీ జోనర్‌లో దర్శకుడు ఆకాశ్ కౌశిక్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. లాజిక్‌ల గురించి ఎక్కువగా ఆలోచించకుండా చూస్తే, ఈ సినిమా మొదటి నుంచి చివరి వరకు చక్కటి వినోదాన్ని పంచుతుంది. సినిమా ప్రారంభం నుంచే కామెడీ డోస్ మాములుగా ఉండదు. విక్రాంత్ పాక్ ఏజెంట్‌గా మారడం, ఆ తర్వాత రోడ్డు ప్రమాదంలో గతం మరచిపోవడం వంటి సన్నివేశాలు థియేటర్లలో నవ్వులు పూయిస్తాయి. ముఖ్యంగా ఆసుపత్రి ఎపిసోడ్ మరియు పాక్ ఏజెంట్ల గందరగోళం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయి. సెకండాఫ్‌లో వినోదం మోతాదు కొద్దిగా తగ్గి, కథ సీరియస్ టర్న్ తీసుకుంటుంది. హీరోకి గతం గుర్తుచేయడానికి జరిగే ప్రయత్నాలు కొన్ని చోట్ల ఫస్ట్ హాఫ్ సీన్లను రిపీట్ చేసిన భావన కలిగిస్తాయి. హీరో, భార్య యమున (సారా అలీఖాన్) మధ్య వచ్చే లవ్ ట్రాక్ కొద్దిగా సాగదీసినట్లు అనిపిస్తుంది. ప్రీ-క్లైమాక్స్‌లో వచ్చే ఊహించని ట్విస్ట్ కథకు మంచి ముగింపునిస్తుంది. దర్శకుడు ఈ సినిమాను ఒక సీరియస్ యాక్షన్ డ్రామాగా కాకుండా పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా మలచడంలో సఫలమయ్యారు.

నటీనటులు

గతం మరిచిన ఏజెంట్‌గా ఆయుష్మాన్ ఖురానా తన అద్భుతమైన టైమింగ్‌తో సినిమాను తన భుజాలపై మోశారు. నవ్వులు పంచుతూనే యాక్షన్ సీన్లలోనూ ఆకట్టుకున్నారు. ఉగ్రవాది పాత్రలో ముకుల్ దేవ్ నవ్వులు పూయించారు. రాహుల్ బోస్, సారా అలీఖాన్ తమ పరిధి మేరకు చక్కటి నటన కనబరిచారు.

ప్లస్ పాయింట్లు
విపరీతమైన హాస్యం, కామెడీ టైమింగ్
ఆయుష్మాన్ ఖురానా అభినయం
ఆసక్తికరమైన ప్రథమార్ధం మరియు క్లైమాక్స్ ట్విస్ట్

మైనస్ పాయింట్లు
ద్వితీయార్ధంలో పునరావృతమైన కొన్ని సన్నివేశాలు
అక్కడక్కడా నెమ్మదించిన కథనం

చివరిగా మంచి వినోదాన్ని కోరుకునే ప్రేక్షకులకు 'ఉడ్తా తీర్' ఒక చక్కటి చాయిస్. లాజిక్‌లను పక్కన పెట్టి చూస్తే, ఈ వీకెండ్‌లో ఫ్యామిలీతో కలిసి హాయిగా నవ్వుకోవచ్చు!

## 'ఉడ్తా తీర్' రివ్యూ..!

